# మరో ఉదయం

TELUGU DAILY & NEWS CHANNEL

సంపుటి : 09 సంచిక : 33 పేజీలు : 08, వెల రూ. 5రూ/ మంగళవారం - 28 - జనవరి- 2025


## మహా కుంభమేళా సందర్భంగా గంగా నదిలో మునిగితే పేదరికం తొలగిపోతుందా? ఖర్గే



2లో

- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా విమర్శించారు.
- ఆకలితో ఉన్నవారి కడుపులు నిండుతాయా? అని ప్రశ్నించారు.
- కానీ మతం పేరుతో పేదలు దోపిడీకి గురవుతున్నారన్నది మా సమస్య' అని అన్నారు.

భోపాల్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా సందర్భంగా

## ఫిజికల్ హెల్త్ ఇండెక్స్‌లో
## ఏపీ స్థానం ఇదే... సీఎం చంద్రబాబు



- నీతి ఆయోగ్ నివేదికలో ఏపీ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం
- రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారుతుందని సీఎం చంద్రబాబు
- ఏపీకి కనీసం అప్పు తీసుకునే అర్హత కూడా లేకుండా గత జగన్ ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు.
- ఆరోగ్యం, ఆర్థిక అంశాల్లో ఏపీలో ఉన్న పరిస్థితిని నీతి ఆయోగ్ వెల్లడించింది.

అమరావతి: ఏపీలో గత వైసీపీ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం సృష్టించిందని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆరోపించారు. ఏపీ ఆర్థిక పరిస్థితిని నీతి ఆయోగ్ నివేదిక వివరించిందని అన్నారు. నీతి ఆయోగ్ నివేదికలో ఏపీ ఆర్థిక పరిస్థితి అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ఆర్థిక విధ్వంసానికి నీతి అయోగ్ నివేదికే నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం అందరూ ఆలోచించాలని తెలిపారు. ఆరోగ్యం, ఆర్థిక అంశాల్లో ఏపీలో ఉన్న పరిస్థితిని నీతి ఆయోగ్ వెల్లడించింది. ఈ నివేదికపై సీఎం చంద్రబాబు స్పందించారు. నాయకుల సమర్థత ఆధారంగా ఆ రాష్ట్ర ప్రజల భవిష్యత్ ఆధారపడి ఉంటుందని అన్నారు. నాయకుల అసమర్థత, తెలియని తనంతో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి అధ్వాన్నంగా మారుతుందని సీఎం చంద్రబాబు చెప్పారు.

## తెలంగాణ నీటి వాటాలను కాపాడేందుకు
## కేంద్రం చర్యలు తీసుకోవాలి..

- తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని విజ్ఞప్తి
- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అనుమతుల సాధనలో విఫలమవ్వడంతో ప్రాజెక్టుల నిర్మాణం
- పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులపై కేంద్రం దృష్టి



వివరాలు 2లో..

గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలను కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అనుమతుల సాధనలో విఫలమవ్వడంతో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం అవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు తక్షణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రాజెక్టులకు అనుమతులు సాధించడంలో జరుగుతున్న జాప్యం, రాష్ట్రానికి జరుగుతున్న నష్టంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ద్వారా

## మీ పథకాలకు ఏ పేరైనా పెట్టుకోండి..
## వాటి జోలికి వస్తే.. జాగ్రత్త



- కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని
- సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం
- గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని
- గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం

హైదరాబాద్, జనవరి 27: కేంద్రమంత్రి బండి సంజయ్ మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు.

## సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసు... మరోసారి స్పందించిన ఫడ్నవీస్

- కేసు వివరాలను పోలీస్ కమిషనర్ వెల్లడిస్తారన్న ఫడ్నవీస్
- ఈ కేసులో ఎవరూ గందరగోళం సృష్టించవద్దని సూచన
- కేసు దర్యాప్తు కొనసాగుతోందన్న మహారాష్ట్ర సీఎం



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి అంశంపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. ఈ రోజు ఆయన ముంబైలో మీడియాతో మాట్లాడుతూ... ఈ కేసుకు సంబంధించి అన్ని విషయాలను ఈ రోజు కానీ, రేపు కానీ ముంబై నగర పోలీస్ కమిషనర్ మీడియాకు చెబుతారని తెలిపారు. అప్పటి వరకు ఈ కేసు విషయంలో ఊహాగానాలు చేయవద్దని, పోలీసులు వెల్లడించని అంశాల ఆధారంగా ఎవరూ గందరగోళం సృష్టించవద్దని సూచించారు.

## యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నాం: తెలంగాణ ఉన్నత విద్యామండలి



- వీసీల నియామకంలో యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడి
- సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయన్న విద్యామండలి
- వీసీలుగా ఉన్నతాధికారుల నియామకం సరికాదన్న ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి

యూనివర్సిటీ వీసీలుగా ఉన్నతాధికారులను నియమించాల నుకోవడం సరికాదని తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకృష్ణారెడ్డి అన్నారు.

## ఉద్యమం సమయంలో విద్యార్థుల పైకి
## రేవంత్ రెడ్డి తుపాకీ గురిపెట్టాడన్న కేటీఆర్

- కాంగ్రెస్ తెచ్చిన పెట్టుబడులు చూసి మనకు కడుపు మంట అంటున్నారని ఆగ్రహం
- రైతు భరోసాపై ఒకే ప్రసంగంలో రేవంత్ రెడ్డి రెండు మాటలు చెప్పారని విమర్శ



హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీ వాళ్లు ఏర్పాటు చేసిన హోర్డింగ్ చూసి నవ్వాలో ఏడవాలో అర్థం కావడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'పెట్టుబడులను చూసి కడుపు మంటా? వాడండి ఈనో' అంటూ ఇటీవల ఓ హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై కేటీఆర్ స్పందించారు. ఈ సిపాయిలు (కాంగ్రెస్ ప్రభుత్వం) తీసుకొచ్చిన పెట్టుబడులను చూసి మనకు అజీర్తి అయిందట... మనం ఈనో తాగాలట అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ క్యాలెండర్ ఆవిష్కరణలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులకు వ్యతిరేకంగా ఉన్నాడని విమర్శించారు. ఏకంగా విద్యార్థుల పైకి తుపాకీ గురిపెట్టాడని ఆరోపించారు. తొమ్మిది నెలల పాటు ఓ తల్లి బిడ్డను ఎలా తన కడుపులో మోస్తుందో... అలాంటి ఇబ్బందులను బీఆర్ఎస్ ఉద్యమం సమయంలో పడిందన్నారు. 14 ఏళ్ల పాటు కేసులు ఎదుర్కొని, లాఠీ దెబ్బలు తిని, ఎన్నో అవమానాలు భరించి తెలంగాణను సాధించిందన్నారు. కానీ ఉద్యమంలో కాంగ్రెస్ పార్టీ పాత్ర ఏమిటో చెప్పాలని నిలదీశారు. రేవంత్ రెడ్డి పెట్టుబడులు తెస్తే అందరికంటే ఎక్కువగా సంతోషిస్తామన్నారు. రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులు అని గప్పాలు కొట్టడం సరికాదన్నారు. 2024లోనూ పెట్టుబడులు తెచ్చామంటూ ఇలాగే చెప్పారని, కానీ ప్రజలకు మీ మీద అనుమానాలు ఉన్నాయన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉంటుందో...

## ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై
## ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు




- మున్సిపాలిటీల్లోని రైతు కూలీలకూ ఈ పథకాన్ని వర్తింప చేయాలని హైకోర్టు ఆదేశాలు
- గ్రామాల్లోని రైతు కూలీలకు ఇచ్చి, మున్సిపాలిటీల్లోని కూలీలకు ఇవ్వడం లేదంటూ పిటిషన్
- పిటిషన్‌ను విచారించి సీఎస్‌కు ఆదేశాలు జారీ చేసిన హైకోర్టు

## స్మృతి మందానాకు ఐసీసీ వన్డే
## మహిళా క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు



ముంబై: భారత మహిళా బ్యాటర్ స్మృతి మందానా కు.. 2024 ఐసీసీ వన్డే క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కింది. గత ఏడాది వన్డే క్రికెట్‌లో స్మృతి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చింది. 2024లో ఆమె రన్‌మెషీన్‌లా స్కోర్ చేసింది. కేవలం 13 వన్డేల్లో 747 రన్స్ చేసిందామె. భారత జట్టు విజయాల్లో బ్యాటర్ స్మృతి కీలక పాత్ర పోషించింది.

## ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు
## మార్గదర్శకాలు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం




- అందరికీ ఇళ్లు పథకంపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు
- నేడు ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి
- రెవెన్యూ మంత్రి ఛైర్మన్ గా ఏర్పాటైన కమిటీ ఆధ్వర్యంలో పర్యవేక్షణ

కమిటీలో సభ్యులుగా పురపాలక, గృహ నిర్మాణ శాఖ మంత్రులు, అధికారులు

## యువగళం పాదయాత్ర..
## అరుదైన జ్ఞాపకం



- యువగళం పాదయాత్ర తనకు జీవితకాలం గుర్తుండిపోయే అరుదైన జ్ఞాపకమన్నారు.
- పాదయాత్ర ప్రతి అడుగులో ప్రజల కష్టాలు చూశానని..
- ఆనాడు కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక ధైర్యం భరోసా

అమరావతి, జనవరి 27: టీడీపీ యువత నేత, మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రను ప్రారంభించి నేటికి రెండేళ్లు పూర్తి అయ్యాయి. ఈ సందర్భంగా లోకేష్ స్పందిస్తూ..

## ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల్లో
## ప్రజల అభిప్రాయాలపై సీఎం చంద్రబాబు సమీక్ష

- ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల నుంచి అభిప్రాయ సేకరణ
- 10 అంశాల ప్రాతిపదికన ఐవీఆర్ఎస్, వివిధ రూపాల్లు సర్వే
- అవినీతిపైనా సర్వేలో ఫిర్యాదులు



అమరావతి: దావోస్ లో వాణిజ్య పర్యటన ముగించుకుని వచ్చిన సీఎం చంద్రబాబు మళ్లీ పరిపాలనలో నిమగ్నమయ్యారు. ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రజల అభిప్రాయం ఎలా ఉందన్న దానిపై తాజాగా సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారుల నుంచి సేకరించిన వివరాల మేరకు ఆయా శాఖల పనితీరుపై ఈ సమీక్షలో చర్చించారు. 10 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని ఐవీఆర్ఎస్, వివిధ రూపాల్లో అభిప్రాయాలు సేకరించారు. సామాజిక పెన్షన్లు, దీపం పథకం, అన్న క్యాంటీన్, ఉచిత ఇసుక సరఫరా, ధాన్యం సేకరణ, ఆసుపత్రులు, దేవాలయాల్లో సేవలపై వివిధ రూపాల్లో సేకరించిన సమాచారాన్ని నేటి సమావేశంలో సమీక్షించారు. పెన్షన్ల పంపిణీపై 90.2 శాతం మంది లబ్ధిదారులు సంతృప్తి వ్యక్తం చేసినట్టు ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా గుర్తించారు. ధాన్యం సేకరణలో 89.92 శాతం మంది రైతులు సంతృప్తి చెందినట్టు వెల్లడైంది. దేవాలయాల్లో దర్శనాలపై 70 శాతం మంది భక్తులు సంతృప్తి వ్యక్తం చేయగా... ఆసుపత్రుల్లో డాక్టర్లు, సిబ్బంది సేవలపై 35 శాతం ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేసినట్టు గుర్తించారు.

## రైతులు కన్నీరు పెట్టినా కనికరించలేదు..
## జగన్‌పై నిమ్మల ఫైర్




- కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం ఆధ్వర్యంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు చేపట్టామని
- నీరు అందక రైతులు కన్నీరు పెట్టినా జగన్ ప్రభుత్వం
- రూ.1050 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు అన్ని అనుమతులు ఇప్పించారన్నారు. బాటిల్ నెక్‌పై సమీక్ష
- ఏపీ చరిత్రలో సీఎంగా జగన్ చేసినంత దగా ఎవరూ చేయలేదన్నారు.

విజయవాడ, జనవరి 27: గత ఐదేళ్లల్లో విధ్వంసకరమైన పాలన సాగిందని.. ఇరిగేషన్ శాఖలో అనేక కీలక ప్రాజెక్టు ల పనులు నిలిపివేశారని మంత్రి నిమ్మల రామానాయుడు వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. నీరు అందక రైతులు కన్నీరు పెట్టినా జగన్ ప్రభుత్వం కనికరం చూపలేదని

# రైతులు కన్నీరు పెట్టినా కనికరించలేదు.. జగన్‌పై నిమ్మల ఫైర్

మొదటి పేజి తరువాయి



మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం ఆధ్వర్యంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు చేపట్టామని తెలిపారు. పోలవరం నిర్మాణ పనులు మొత్తం ఆపివేస్తే.. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ ఊపిరి పోశారన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్‌ను ఇటీవల చంద్రబాబు సందర్శించారని.. ఉత్తరాంధ్ర, రాయలసీమకు నీరు ఇవ్వాలని చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు.

టైం బాండ్ పెట్టుకుని మరీ...

ఆర్థిక పరిస్థితి అనుకూలంగా లేకున్నా కొంతవరకైనా నీరు ఇచ్చేలా పనులు చేస్తున్నారన్నారు. పోలవరం లెఫ్ట్ కెనాల్ పనులు పూర్తి చేసి 2025 జులైకు ఉత్తరాంధ్రకు నీరు ఇవ్వనున్నారని తెలిపారు. రూ.1050 కోట్ల రూపాయలతో చేపట్టిన పనులకు అన్ని అనుమతులు ఇప్పించారన్నారు. బాటిల్ నెక్‌పై సమీక్ష చేసి పురుషోత్తం పట్నం మీదుగా ఉత్తరాంధ్రకు నీరు ఇస్తామని.. దీనిపై అధికారులతో సమీక్ష చేసి పలు సూచనలు చేశామన్నారు. గత వైసీపీ పాలనలో పార మట్టి, కట్ట సిమెంట్ కూడా వేయలేదని మండిపడ్డారు. ఉత్తరాంధ్ర ప్రజలకు అన్ని విధాలా అన్యాయం చేసిన ఘనుడు జగన్‌మోహన్ రెడ్డి అంటూ విరుచుకుపడ్డారు. నిర్ణీత టైం బాండ్ పెట్టుకుని మరీ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఇంకా పోలవరం గురించి వైసీపీ నేతలు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు సారధ్యంలో డయా ఫ్రం వాల్ నిర్మాణం చేస్తే.. జగన్ జమానాలో అదే డయా ఫ్రం వాల్ కొట్టుకుపోయేలా చేశారన్నారు. అసెంబ్లీలో పోలవరం ప్రాజెక్టు గురించి అడిగితే వైసీపీ నేతలు చెప్పకుండా పారిపోయారని వ్యాఖ్యలు చేశారు.

అందరికీ ఇళ్లు పథకం గైడ్‌లైన్స్.. మీరు అర్హుల్లో కాదో చెక్ చేసుకోండి

కుర్చీ కోసం రాజకీయ డ్రామాలు..

జగన్ ప్రభుత్వంలో పోలవరం ప్రాజెక్టు పనులు పూర్తిగా నిలిచిపోయాయన్నారు. కుర్చీ కోసం జగన్ రాజకీయ డ్రామాలు ఆడారన్నారు. 2019-24 మధ్య ఎన్ని ఇరిగేషన్ ప్రాజెక్టులు నిర్మాణం చేశారని ప్రశ్నించారు. పోలవరం రైట్ కెనాల్, లెఫ్ట్ కెనాల్‌లో నీరు ఉంటేనే రైతులకు మేలు జరుగుతుందన్నారు. ఏపీ చరిత్రలో సీఎంగా జగన్ చేసినంత దగా ఎవరూ చేయలేదన్నారు. ఈ యేడాది డిసెంబరు నాటికి డయా ఫ్రం వాల్ పూర్తి చేస్తామని వెల్లడించారు. 2027 చివరి నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేసి ప్రకాశం జిల్లాకు సాగు, తాగు నీరు ఇస్తామన్నారు. చింతలపూడి ప్రాజెక్టును కూడా అటకెక్కించారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల, నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడిందన్నారు. ఇప్పుడు ఉన్న అడ్డంకులను అధిగమించి పనులు పూర్తి చేస్తామన్నారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులు పూర్తి చేస్తున్నామని చెప్పారు. కృష్ణా, గోదావరి నదులకు ద్రోహం, దగా చేసిన వ్యక్తి జగన్ అంటూ విరుచుకుపడ్డారు. విభజన చట్టం ప్రకారం మనకు నీరు, ప్రాజెక్టుల వాడకంపై ఒప్పందం జరిగిందని తెలిపారు.

ఆచితూచి నిధులు...

జగన్ ప్రభుత్వంలో 2023 సంవత్సరంలో ఇరిగేషన్ ప్రాజెక్టులపై కేంద్రం నుంచి వచ్చిన సూచనలను పట్టించుకోలేదన్నారు. జగన్ తన కేసుల కోసం తెలుగు ప్రజలు భవిష్యత్తును తాకట్టు పెట్టారన్నారు. ప్రజల హక్కులను హరించే విధంగా జగన్ వ్యవహరించారన్నారు. విభజన చట్టం ప్రకారం నిధులు, నియామకాలు ఉన్నా జగన్ పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో తప్పకుండా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. 14 లక్షల కోట్లు అప్పులు పెట్టి గత పాలకులు వెళ్లారని.. ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెడతామన్నారు. అన్నీ పూర్తి చేయాలని ఉన్నా ఆర్థిక ఇబ్బందులు ప్రభుత్వానికి ఉన్నాయని తెలిపారు. 2014-2019 మధ్య అభివృద్ధికి నిధులు సీఎం చంద్రబాబు వెంటనే ఇచ్చేవారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల ఇప్పుడు ఆచితూచి చంద్రబాబు నిధులు విడుదల చేస్తున్నారని తెలిపారు. ఐదు సంవత్సరాల్లో జరిగిన విధ్వంసాన్ని సరిచేయడానికి కొంత సమయం పడుతుందని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.

# యువగళం పాదయాత్ర.. అరుదైన జ్ఞాపకం

మొదటి పేజి తరువాయి



యువగళం పాదయాత్ర తనకు జీవితకాలం గుర్తుండిపోయే అరుదైన జ్ఞాపకమన్నారు. నియంతృత్వాన్ని, నిర్బంధాలను దాటుకొని రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాలు, 97 నియోజకవర్గాలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3132 కిలోమీటర్లు సాగిన చారిత్రాత్మక యువగళం పాదయాత్ర మొదలై నేటికి రెండేళ్లు పూర్తైందన్నారు. నాటి పాలకులు పాదయాత్ర ఆపడానికి చెయ్యని ప్రయత్నం లేదన్నారు. మైక్ వెహికల్ సీజ్ చెయ్యడం దగ్గర నుంచి వాలంటీర్లను అరెస్టు చేయడం వరకూ అనేక విధాలుగా ఇబ్బందులు పెట్టారని గుర్తుచేసుకున్నారు. నాటి పాలకులు ఎన్ని అడ్డంకులు పెట్టినా ప్రజలు చూపించిన ప్రేమ తనను మరింత దృఢంగా మార్చిందన్నారు. పాదయాత్ర ప్రతి అడుగులో ప్రజల కష్టాలు చూశానని.. ఆ రోజు చూసిన కన్నీటి గాధలు నేటికీ గుర్తున్నాయన్నారు. ఇచ్చిన ప్రతి హామీ గుర్తుందని తెలిపారు. ప్రజల ఆకాంక్షకు తగ్గట్టుగా ప్రజా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. హామీలు అన్ని క్రమ పద్ధతిలో అమలు చేస్తున్నామన్నారు. యువగళం పాదయాత్రలో ప్రత్యక్షంగా- పరోక్షంగా భాగమైన ప్రతి ఒక్కరికీ, తనను ఆదరించిన ప్రజలకు మంత్రి నార లోకేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అందరికీ ఇళ్లు పథకం గైడ్‌లైన్స్.. మీరు అర్హుల్లో కాదో చెక్ చేసుకోండి

**టీడీపీ నేతల సంబరాలు...**

అమరావతి: మరోవైపు యువగళం పాదయాత్ర ప్రారంభించి నేటికి రెండు సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో కేంద్ర కార్యాలయంలో నేతలు , కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. టీడీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాదెండ్ల బ్రహ్మం ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి టపాసులు కాల్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, జీవీ రెడ్డి,అశోక్ బాబు తదితర నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాదెండ్ల బ్రహ్మం మాట్లాడుతూ.. నారా లోకేష్‌ను చూస్తే వైసీపీ నేతల వెన్నులో వణుకు పుడుతుందన్నారు. పాదయాత్ర ప్రారంభించేటప్పుడు అవహేళన చేసిన వైసీపీ నేతలకు పాదయాత్ర పూర్తయ్యే నాటికి భయం ఏర్పడిందన్నారు. తండ్రి, తాత ముఖ్యమంత్రులుగా ఉన్న నారా లోకేష్ ఎక్కడ అధికార దర్పం ప్రదర్శించలేదని తెలిపారు. ఈరోజు కూటమి గెలుపులో నారా లోకేష్ పాత్ర ఎంతో ఉందన్నారు.

తొలిరోజే చెప్పి..చేసి చూపించారు: భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి

నారా లోకేష్ పాదయాత్ర ప్రజలకు ఒక భరోసా కల్పించిందని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. జగన్‌ను తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చో పెడతామని పాదయాత్ర తొలి రోజే చెప్పి.. చేసి చూపించిన నేత లోకేష్ అని కొనియాడారు. ఆనాడు కష్టాల్లో ఉన్న ప్రతి ఒక్కరికీ ఒక ధైర్యం భరోసా కల్పిస్తూ పాదయాత్ర సాగిందన్నారు.

**నేనున్నానంటూ భరోసా: జీవీ రెడ్డి**

ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు నారా లోకేష్ పాదయాత్రతో ఒక భరోసా ధైర్యం ఏర్పడిందని ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ జీవీ రెడ్డి అన్నారు.ర పాదయాత్రలో ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకునే పనిలోనే లోకేష్ ఉన్నారన్నారు. టీడీపీ కార్యకర్తలకు చిన్న కష్టం వచ్చినా నేనున్నానని

# మీ పథకాలకు ఏ పేరైనా పెట్టుకోండి.. వాటి జోలికి వస్తే.. జాగ్రత్త

మొదటి పేజి తరువాయి



సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. కేంద్ర సంక్షేమ పథకాల పేర్లను మార్చితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన, గరీబ్ కళ్యాణ్ యోజన వంటి పథకాలను రాష్ట్ర ప్రభుత్వ ప్రమేయం లేకుండా కేంద్రమే నేరుగా ప్రజలకే అందిస్తుందన్నారు. పరిస్థితి అంత వరకు తీసుకురావొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. సంక్షేమ పథకాల అమలు విషయంలో పేదలకు ఎట్టి పరిస్థితిల్లోనూ తాము అన్యాయం చేయబోమని స్పష్టం చేశారు. ప్రజలందరికీ ఉచితంగా బియ్యం కేంద్రమే ఇస్తోంది కదా... గరీబ్ కళ్యాణ్ యోజన అని పేరు పెడితే తప్పేంది? ప్రధాని ఫోటో ఎందుకు పెట్టరు అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఖర్చయ్యే సంక్షేమ పథకాలకు ఎవరి పేరు పెట్టుకున్నా తమకు అభ్యంతరం లేదని.. కాంగ్రెస్‌కు నచ్చితే ఒసామా బిన్ లాడెన్, దావూద్ ఇబ్రహీం పేర్లు పెట్టుకున్నా అభ్యంతరం లేదంటూ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని విమర్శించారు. అభివృద్ధి విషయంలో కేంద్రం పూర్తిగా సహకరిస్తోందన్నారు. గత 10 ఏళ్లలో రూ.12 లక్షల కోట్లకుపైగా కేంద్రం ఖర్చు చేసిందని తెలిపారు. గ్రామాల్లో జరిగిన అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే అని స్పష్టం చేశారు. రైతు భరోసా, కమ్యూనిటీ హాల్, స్మశాన వాటిక, వీధి దీపాలు, రోడ్ల పైసలన్నీ కేంద్ర ప్రభుత్వానివే అని చెప్పుకొచ్చారు. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేనేలేదన్నారు.

**జగన్ కేసులపై సుప్రీం తాజా నిర్ణయం ఇదీ..**

**ఇంత దుర్మార్గమా?**

“మండలానికి ఒక గ్రామంలోనే నాలుగు పథకాలకు ఎంపిక చేసి లబ్ది చేయడమేంది? మిగిలిన గ్రామాల ప్రజలు కాంగ్రెస్‌కు ఓట్లేయలేదా? రాష్ట్ర ప్రజలకు ఇంత దుర్మార్గంగా చీటింగ్ చేస్తారా? రాష్ట్ర ప్రజలందరికీ లబ్ది చేకూరుస్తామని చెప్పి మండలానికి ఒక గ్రామానికి లబ్ది చేకూర్చడం నీచం. కాంగ్రెస్ నేతల జేబుల నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు ఖర్చు చేస్తున్నారా? లేక పాకిస్తాన్..బంగ్లాదేశ్ నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారా? ప్రజలు కట్టిన పన్నులతోనే కేంద్రమైనా, రాష్ట్రమైనా ఖర్చు చేస్తోంది కదా? గతంలో పీఎం ఆవాస్ యోజన పేరుతో 2 లక్షల 40 వేల ఇండ్లను కేంద్రం మంజూరు చేస్తే... కేసీఆర్ ఒక్క ఇల్లు కట్టకుండా ప్రజలను రోడ్డున పడేసింది నిజం కాదా? డబుల్ బెడ్రూం ఇండ్ల పేరుతో ప్రజలను మభ్యపెట్టి మోసం చేసింది నిజం కాదా?” అంటూ ప్రశ్నలు కురిపించారు.

**గద్దర్‌కు ఎట్లా ఇస్తారు..**

పద్మ అవార్డుల జాబితాను పంపేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి పంపాలని హితవుపలికారు. గద్దర్‌కు ఎట్లా పద్మ అవార్డులిస్తామని ప్రశ్నించారు. ఎంత మంది బీజేపీ కార్యకర్తలను మట్టు పెట్టారో తెలియదా అని అన్నారు. వందల మంది బీజేపీ కార్యకర్తలు నమ్మిన సిద్ధాంతం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళన చేస్తే... నక్సలైట్లతో కలిసి హత్య చేయించిన వ్యక్తి గద్దర్ అంటూ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ సెంటిమెంట్‌తో ఎవరు లాభపడ్డారో... ఎవరు బలైపోయారో ప్రజలందరికీ అర్థమైందని కేంద్రమంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

# ఫిజికల్ హెల్త్ ఇండెక్స్‌లో ఏపీ స్థానం ఇదే... సీఎం చంద్రబాబు

మొదటి పేజి తరువాయి



**వైసీపీ హయాంలో ప్రభుత్వ కార్యాలయాల తాకట్టు..**

నీతి అయోగ్ ఇచ్చిన నివేదిక ఏపీ ఆర్థిక పరిస్థితి ఎంత అధ్వాన్నంగా ఉందనేది వివరించిందని అన్నారు. 2014-2015 నుంచి 2022-2023 వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని నీతి ఆయోగ్ సమీక్షించిందని అన్నారు. ఫిజికల్ హెల్త్ ఇండెక్స్‌లో ఏపీ చివరిలో ఉందని నీతి ఆయోగ్ చెప్పిందని గుర్తుచేశారు. ఏపీకి కనీసం అప్పు తీసుకునే అర్హత కూడా లేకుండా గత జగన్ ప్రభుత్వం చేసిందని మండిపడ్డారు. కనీసం చేసిన అప్పులకు వడ్డీలు కూడా చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని అన్నారు. అభివృద్ధి పనులపై ఎక్కువ నిధులు ఖర్చు చేయాలని చెప్పారు. అప్పులు చేసి పనులు చేస్తే ఇబ్బందులు పెరుగుతాయన్నారు. అప్పు చేస్తే తిరిగి చెల్లించే శక్తి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి లేదని చెప్పారు. పన్నులు పెరుగుతాయి, అప్పులు చేయాల్సి వస్తోందని అన్నారు. అందుకే వైసీపీ ప్రభుత్వం ప్రభుత్వ కార్యాలయాలను తాకట్టు పెట్టిందని ఆరోపించారు. గత ఐదేళ్లలో వచ్చిన ఆదాయం ఏం చేశారో తెలియదని సీఎం చంద్రబాబు అన్నారు.

**సంపద సృష్టించాలి..**

“ఆర్థిక పరిస్థితి చూసి.. ఆ రాష్ట్ర పరిస్థితి చెప్పగలం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగుంటేనే సంక్షేమం, అభివృద్ధి. ఏ రాష్ట్రమైనా బాగుపడాలంటే సంపద సృష్టించాలి. ఆదాయం పెంచి.. సంక్షేమానికి డబ్బు కేటాయించాలి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోతే.. ప్రజలకు ఇబ్బందులు తప్పవు. వైసీపీ పాలనలో వృద్ధి రేటు సగానికి పైగా పడిపోయింది. నేను గతంలో చెప్పిన విషయాలను ఇప్పుడు నీతి ఆయోగ్ ధ్రువీకరించింది. వెంటిలేటర్‌పై ఉండే ప్రభుత్వాన్ని వెంటిలేటర్ తేసేశాం. కానీ పరిగెత్తే పరిస్థితి లేదు. ఆదాయం పెరగాలి..అందుకనుగుణంగా పనిచేస్తున్నాం. డెట్ రీ షెడ్యూల్‌కు వెళ్తున్నాం. ఇప్పుడు అప్పులు ఇచ్చే పరిస్థితి లేదు. ఆదాయం , తలసరి ఆదాయం పెరగాలి. కానీ తలసరి అప్పు పెరిగింది. వైసీపీ ప్రభుత్వం చేసిన దుర్మార్గం ఇది. నేను మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేశాను. కానీ ఈసారి పరిస్థితి ఎప్పుడు లేదు. ప్రజలు అందరికీ చెబుతున్నా...కొంత ఆలస్యం అయింది...అందరు అర్థం చేసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం. ఆదుకోబట్టి కొంతవరకు నిలబడ్డాం. 2019లో టీడీపీ గెలిస్తే ఈ పరిస్థితి వచ్చేది కాదు. నేను ఢిల్లీ వెళ్తే చాలామంది అధికారులు మీరు ఆర్థికంగా నిలవడగలుగుతారా? అని అడిగారు. దీనిని రివైవ్ చేస్తాం.. త్వరలోనే గాడిలో పెడతాం.” అని సీఎం చంద్రబాబు తెలిపారు.

**అప్పు తెచ్చి వడ్డీలు కట్టారు..**

“అప్పులు తెచ్చి జల్సాలు చేశారు.. ఆదాయం ఎలా పెరుగుతుంది. గత ఐదేళ్లలో వచ్చిన ఆదాయం ఏం చేశారో తెలియదు. మంచి రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లోకి పడేశారు. ఏపీని అప్పుల ఊబిలోకి నెట్టేశారు. తెచ్చిన అప్పులో కనీసం 50శాతం క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్‌కు పెట్టాలి. వైసీపీ హయాంలో అప్పు తెచ్చి వడ్డీలు కట్టారు. గత ఐదేళ్లలో కమిటెడ్ ఎక్స్‌పెండీచర్ 11.6శాతానికి చేరింది. స్టేట్ ఓన్ రివెన్యూ గ్రోత్ రేట్ పడిపోతూ వస్తోంది. అప్పు తీర్చలేని పరిస్థితికి తెచ్చారు. ఏపీని శ్రీలంక చేస్తున్నారని అప్పుడే చెప్పాను” అని సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

**టెక్నాలజీతో మెరుగ్గా ప్రభుత్వ సేవలు: చంద్రబాబు**

ఆర్టీజీఎస్‌పై ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబు సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటిలో ఏఐ ప్రొఫెషనల్ ఉండాలని చెప్పారు. ఏఐను కూటమి ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందని అన్నారు. టెక్నాలజీతో మెరుగ్గా ప్రభుత్వ సేవలు అందిస్తుందన్నారు. ఆర్టీజీఎస్‌తో అన్ని శాఖల డేటా అనుసంధానం చేస్తామని వివరించారు. త్వరలో వాట్సాప్ గవర్నెన్స్ ప్రవేశపెడతామని సీఎం చంద్రబాబు ప్రకటించారు.

# ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంపై ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలు

గ్రామాల్లోని రైతు కూలీలతో పాటు మున్సిపాలిటీల్లోని రైతు కూలీలనూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలోకి తీసుకు రావాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద గ్రామాల్లోని రైతు కూలీలకు ఏటా రూ.12 వేలు ఇచ్చి, మున్సిపాలిటీల పరిధిలోని రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదంటూ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. భూమి లేని రైతు కూలీలకు రూ.12 వేలు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో ఇప్పటికే రైతు ఆత్మీయ భరోసా కోసం దరఖాస్తులను స్వీకరించింది. గ్రామాల్లోని రైతు కూలీలకు ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందని, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న రైతు కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదని పేర్కొంటూ నారాయణపేటకు చెందిన గవినోళ్ళ శ్రీనివాస్ అనే వ్యక్తి ఈ పిటిషన్ వేశారు. రాష్ట్రంలో 129 మున్సిపాలిటీలు ఉన్నాయని, ఈ మున్సిపాలిటీలలో 8 లక్షల మందికి పైగా రైతు కూలీలు ఉన్నారని పిటిషనర్ తరపు న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ హైకోర్టుకు తెలిపారు. గ్రామాల్లోని రైతు కూలీలకు ఈ పథకం ఇచ్చి, పట్టణ కూలీలకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. రైతు కూలీలు ఎక్కడ ఉన్నా సమానంగా చూడాలన్నారు.

# ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మార్గదర్శకాలు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం

అమరావతి: ‘అందరికీ ఇళ్లు’ పథకంలో భాగంగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే అంశంపై ఏపీ ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేడు ఉత్తర్వులు జారీ చేశారు. అందరికీ ఇళ్లు పథకంలో భాగంగా గ్రామాల్లోని పేదలకు 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లోని పేదలకు 2 సెంట్లు స్థలం ఇవ్వనున్నారు. ఇళ్ల స్థలాలకు ప్రభుత్వం కన్వేయన్స్ డీడ్ ఇస్తుందని ఉత్తర్వుల్లో తెలిపారు. పదేళ్ల కాల పరిమితితో ఫ్రీ హోల్డ్ హక్కులు కల్పించేలా కన్వేయన్స్ డీడ్ ఇవ్వనున్నట్టు వివరించారు. జీవితకాలంలో ఒకసారే ఉచిత ఇంటిపట్టా ఇచ్చేలా విధివిధానాలకు రూపకల్పన చేశారు. ఇంటిపట్టా ఇచ్చిన రెండేళ్ల లోగా నిర్మాణం చేపట్టాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న కుటుంబాలకే ఉచిత ఇంటిస్థలం కేటాయిస్తారని పేర్కొన్నారు. లబ్ధిదారులకు రాష్ట్రంలో ఇంకెక్కడా ఇంటిస్థలం, సొంత ఇల్లు ఉండకూడదని స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర గృహనిర్మాణ పథకాల్లో లబ్ధిదారులుగా ఉండరాదని తెలిపారు. రెవెన్యూ మంత్రి చైర్మన్‌గా ఏర్పాటైన కమిటీ ఈ అందరికీ ఇళ్లు పథకాన్ని పర్యవేక్షిస్తుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. పురపాలక, హౌసింగ్ శాఖ మంత్రులు, ఉన్నతాధికారులు ఈ కమిటీలో సభ్యులుగా వ్యవహరిస్తారని వివరించారు.వివిధ శాఖల మధ్య సమన్వయానికి అధికారుల కమిటీని కూడా నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

# స్మృతి మందానాకు ఐసీసీ వన్డే మహిళా క్రికెటర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు

జూన్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో ఇండియా 3-0 తేడాతో గెలవడంలో స్మృతి కీలకంగా నిలిచింది. అక్టోబర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో.. తుది వన్డేల్లో సెంచరీతో చెలరేగింది. డిసెంబర్‌లో ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన మ్యాచ్‌లో సెంచరీ చేసి తన సత్తా చాటిందామె. మహిళ వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో .. స్మృతి మందానా కొత్త స్టాండర్డ్‌ను నెలకొల్పింది. ఓ క్యాలెండర్ సంవత్సరంలో అత్యధిక పరుగులు చేసిన క్రికెటర్‌గా నిలిచింది. 2024లో ఆమె 13 మ్యాచుల్లో 747 రన్స్ చేసింది. దీంతో మహిళల వన్డేల్లో లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ మందానా.. లీడింగ్ రన్ స్కోరర్‌గా నిలిచింది. లౌరా వోల్వార్డ్ 697, టమ్మీ బీమౌంట్ 554, హేలే మాథ్యూస్ 469 రన్స్‌తో ఆ తర్వాత స్థానాల్లో ఉన్నారు. మందానా 57.86 సగటుతో బ్యాటింగ్ చేసింది. ఆమె స్ట్రయిక్ రేట్ 95.15గా ఉంది. దూకుడు ఆటతీరుతో ఇండియన్ టాప్ ఆర్డర్ బ్యాటర్లలో ఆమె ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకున్నది. గత ఏడాది స్మృతి మందానా.. నాలుగు వన్డే సెంచరీలు నమోదు చేసింది. మహిళల క్రికెట్‌లో ఇదో కొత్త రికార్డు. 2004లో వన్డేల్లో వందకుపైగా బౌండరీలను బాదింది. వీటిల్లో 95 ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి.

# కాంగ్రెస్ తెచ్చిన పెట్టుబడులు చూసి మనకు కడుపు మంట అంటున్నారని ఆగ్రహం

కాంగ్రెస్ పార్టీ 420 హామీల్లో వాస్తవం కూడా అంతే ఉంటుందన్నారు. ప్రజల సొమ్ముతో హోర్డింగ్స్ పెడుతున్నారని ఆరోపించారు. అందులో మా బొమ్మలతో మీకేం పని... మీ బొమ్మలు పెట్టుకోండని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేతనైతే వారు చెప్పిన పెట్టుబడులు ఎప్పుడు వస్తాయో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన పని కంటే... ఎక్కువ పని చేస్తే రేవంత్ రెడ్డికి సన్మానం చేస్తామన్నారు. నిన్న కొడంగల్?లో ఒకే ప్రసంగంలో రైతు భరోసాపై సీఎం రేవంత్ రెడ్డి రెండు మాటలు మాట్లాడారన్నారు. అపరిచితుడు సినిమాలో రాము, రెమోలా రేవంత్ రెడ్డి తీరు ఉందని ఎద్దేవా చేశారు. రైతు భరోసా డబ్బులు రేపు తెల్లారేసరికి పడతాయని మొదట చెప్పారని, ఆ తర్వాత కాసేపటికే ఈ నెల 31 అని మాట మార్చాడన్నారు. కాంగ్రెస్ నేతల మాటలకు గ్యారెంటీ లేదన్నారు. ఓట్ల కోసమే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అంటున్నారని ఆరోపించారు.

**తెలంగాణ నీటి వాటాలను కాపాడేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలి..**

200 టీఎంసీల గోదావరి నీటిని పెన్నా బేసిన్‌కు తరలించడం వల్ల తెలంగాణ సాగునీటి ప్రయోజనాలు హరించబడతాయని హరీశ్‌రావు అన్నారు. విభజన చట్టం ప్రకారం గోదావరి-కృష్ణా బోర్డుల అనుమతులు తప్పనిసరిగా ఉన్నా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనుమతులు లేకుండా ప్రాజెక్టు చేపట్టడం చట్ట ఉల్లంఘించడమే అని స్పష్టం చేశారు. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు ప్రాజెక్టుకు నిధుల కోసం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు రెండు లేఖలు రాయడం పట్ల హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు రోజుకు 3 టీఎంసీలు ఎత్తిపోసే ప్రణాళికల అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉండటం శోచనీయమని అన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు అనుమతి రావడానికి కేంద్రం 6 నెలలుగా జాప్యం చేస్తోందని తెలిపారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు ఛత్తీస్‌గఢ్ జారీపై కేంద్రం జోక్యం అవసరమని అభిప్రాయపడ్డారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి పర్యావరణ అనుమతులపై కేంద్రం దృష్టి సారించాల్సిన అవసరం ఉందని లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పంపిన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవడం లేదని తెలిపారు. మిషన్ కాకతీయ, చెరువుల పునరుద్ధరణ, చెక్ డ్యామ్‌ల ద్వారా సాగునీటి అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయని చెప్పారు. వరద జలాల వినియోగం కోసం కాళేశ్వరం ప్రాజెక్టుకు అదనపు 1 టీఎంసీ నీరు ఎత్తిపోసే ప్రణాళికకు అనుమతులు ఇంకా లభించలేదని అన్నారు. గోదావరి నదీ జలాల్లో తెలంగాణకు కేటాయించిన నీటి వాటాలను కాపాడేందుకు కేంద్రం తక్షణ చర్యలు తీసుకోవాలని హరీశ్‌రావు కోరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల అనుమతుల సాధనలో విఫలమవ్వడంతో ప్రాజెక్టుల నిర్మాణం ఆలస్యం అవుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాల రక్షణ కోసం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గారు తక్షణ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర హక్కులను కాపాడే చర్యలు చేపట్టడంలో కేంద్రం పూర్తి స్థాయి సహకారం అందించాలని కోరారు.

**యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నాం: తెలంగాణ ఉన్నత విద్యామండలి**

వీసీల నియామకంలో యూజీసీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. యూజీసీ మార్గదర్శకాలు ప్రైవేటీకరణను ప్రోత్స హిస్తున్నాయని ఆరోపించారు. యూజీసీ మార్గదర్శకాలు సమాఖ్యస్ఫూర్తికి విరుద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర విశ్వవిద్యాలయాలను దెబ్బతీసేలా కేంద్రం నిర్ణయాలు ఉన్నాయన్నారు. వర్సిటీలు స్వతంత్రంగా ఉండాలన్నారు. ఈ అంశంపై ఒక కమిటీని వేసుకున్నామని, కమిటీ ఇచ్చే రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. వర్సిటీల్లో ఖాళీల భర్తీపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కాగా, రాష్ట్రాల పరిధిలోని విశ్వ విద్యాలయాల మార్గదర్శకాల్లో మార్పుల చేస్తామంటూ యూజీసీ రాష్ట్రాలకు ప్రతిపాదనలు పంపించింది. వీటి ప్రకారం వీసీలను నియమించే అధికారం కేంద్ర ప్రభుత్వానికి లభిస్తుంది.

# సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసు... మరోసారి స్పందించిన ఫడ్నవీస్

కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోందన్నారు. ఆయన ఇంకా మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం ఆశించినట్లుగా భారతీయ సాక్ష్యాధార వ్యవస్థను అమలు చేసిన మొదటి రాష్ట్రంగా మహారాష్ట్ర నిలిచిందని ఫడ్నవీస్ అన్నారు. మొబైల్ ఫోరెన్సిక్ వ్యాన్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఫోరెన్సిక్ నిపుణులతో కూడిన ఈ వాహనం ఏ ఘటన జరిగినా ఆ కేసుకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తుందన్నారు. ఇప్పుడు ఆధారాలను ఎవరూ తారుమారు చేయలేరని వెల్లడించారు. ఈ వ్యాన్లను అన్ని పోలీస్ స్టేషన్‌లలో అందుబాటులో ఉంచుతామని వెల్లడించారు.

# మహా కుంభమేళా సందర్భంగా గంగా నదిలో మునిగితే పేదరికం తొలగిపోతుందా? ఖర్గే



బీజేపీ నేతలు పవిత్ర స్నానాలు ఆచరించడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే తీవ్రంగా విమర్శించారు. వారు గంగా నదిలో మునిగితే దేశంలో పేదరికం తొలిగిపోతుందా? ఆకలితో ఉన్నవారి కడుపులు నిండుతాయా? అని ప్రశ్నించారు. సోమవారం మధ్యప్రదేశ్‌లోని మోవ్‌లో జరిగిన ‘జై బాపు, జై భీమ్, జై సంవిధన్’ సభలో మల్లికార్జున్ ఖర్గే మాట్లాడారు. ‘నేను ఎవరి విశ్వాసాన్ని ప్రశ్నించాలనుకోవడం లేదు. ఎవరైనా తప్పుగా భావిస్తే నేను క్షమాపణలు కోరుతున్నా. అయితే నాకు చెప్పండి. ఒక పిల్లవాడు ఆకలితో చనిపోతున్నప్పుడు, స్కూల్‌కు వెళ్లనప్పుడు, కార్మికులకు వారి బకాయిలు అందనప్పుడు, అటువంటి సమయంలో ఈ వ్యక్తులు (బీజేపీ నేతలు) వేల రూపాయలు ఖర్చు చేసి (గంగా నదిలో) మునగడానికి పోటీ పడుతున్నారు. ఫొటోల్లో బాగా కనిపించే వరకు వారి స్నానాలు కొనసాగుతాయి’ అని విమర్శించారు. కాగా, ఇలాంటి వ్యక్తులు దేశానికి మేలు చేయలేరని మల్లికార్జున్ ఖర్గే విమర్శించారు. ‘దేవుడిపై

## పాల్ రెడ్డి మెమోరియల్ పాఠశాలలో
## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



పులివెందుల : 76 వ గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని పాల్ రెడ్డి మెమోరియల్ పాఠశాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు క్రిష్ణమ్మ అధ్యక్షతన గణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ముందుగా ముఖ్య అతిధిలుగా హాజరైన అశ్వర్ధ జూవెలర్స్ అధినేత నారాయణ, లక్ష్మి శ్రీనివాస జూవెలర్స్ రామ్ మోహన్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు లు జాతీయ పతాకం ఆవిష్కరణ చేసి జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ చిత్ర పటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అశ్వర్ధ జూవెలర్స్ అధినేత నారాయణ అందజేసిన విద్యా సామాగ్రిని అశ్వర్ధ జూవెలర్స్ అధినేత నారాయణ, లక్ష్మి శ్రీనివాస జూవెలర్స్ రామ్ మోహన్, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ల చేతులమీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ఉపాధ్యాయ బృందం, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.



## లింగాల జిల్లాపరిషత్ హైస్కూలులో
## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



లింగాల : లింగాల మండలకేంద్రంలోని ఎగువలింగాల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 76వ గణతంత్రదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాతుపాటి ప్రసాద్ జాతీయజెండా ఎగురవేసి వందన సమర్పణ చేశారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు రిపబ్లిక్ డే విశిష్టత, రాజ్యాంగ రచన కోసం మన జాతీయనాయకులు చేసిన కృషి, రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమికహక్కులు, విధులు, ఆదేశసూత్రాలు, మన బాధ్యతలు, దేశ సర్వభౌమాధికారాన్ని సమైక్యతను కాపాడడానికి విద్యార్థులు కంకణ బద్ధులై ఉండాలనే అంశాలను వివరించారు. తదనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈసందర్భంగా చదువులో ప్రతిభ కనపరిచిన, క్రమశిక్షణకలిగిన విద్యార్థులను గుర్తించి, వారికి ఉపాధ్యాయులు బహుమతులు ప్రదానం చేశారు. తరువాత విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమాన్ని ముగించారు. లిఈ కార్యక్రమంలో లింగాల జిల్లాపరిషత్ హైస్కూలు హెడ్మాస్టర్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ రెడ్డి, దివ్యాంగుల విద్యా సహాయకులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, అటెండర్ షరీఫ్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు



## ప్రజాసేవకు సరైన వేదిక మానవతా సంస్థ



పులివెందుల : దేశ గణతంత్ర దినోత్సవ మరియు మానవత నెలవారి సమావేశ సందర్భంగా 26 1 2025 తేదీన పులివెందుల పెన్షనర్స్ అసోసియేషన్ భవనమునందు సమావేశం ఏర్పాటు చేయడమైనది. సభ అధ్యక్షులుగ మానవత సెక్రటరీ గంగిరెడ్డి ముఖ్య అతిథులుగా, వై రమణారెడ్డి ఫిజియోథెరపిస్ట్ రిటైర్డ్ ఆర్మీ , పులివెందుల పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏవి గోపాల్ రెడ్డి హాజరయ్యారు. ప్రార్థన గీతము జేవి రామ రెడ్డి రిటైర్డ్ టి ఓ టెలికంగారు ఆలపించారు.. ముఖ్య అతిథి వై రమణారెడ్డి మాట్లాడుతూ ప్రజాసేవకు సరైన వేదిక మానవతా సంస్థ అంటూ మానవతా సేవలను కొనియాడుతూ సంస్థకు పదివేల రూపాయలు విరాళము ప్రకటించారు. సమావేశంలో మానవతా చైర్మన్ డి వి కొండా రెడ్డి మానవతా కుటుంబ సభ్యులు రాఘవ రెడ్డి కే రామసుబ్బారెడ్డి టి కృష్ణమూర్తి ప్రసంగించారు. సమావేశానికి హాజరైన సభ్యులకు ఏవీ గోపాల్ రెడ్డి పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అల్పాహారం ను అందజేయడం జరిగింది. సమావేశంలో వక్తలు గణతంత్ర దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేస్తూ జాతీయ గీతాలాపనతో సమావేశం ముగించడం జరిగింది.

## ఆహార విజ్ఞాన శాస్త్ర - సాంకేతిక కళాశాలలో
## " 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు"



పులివెందుల : పులివెందుల లోని ఆహార విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక కళాశాలలో " 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు" ఆదివారం అనగా జనవరి 26 న ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ కళాశాల ప్రధాన భవనం ఎదురు జాతియ జెండా ఎగురవేశారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ మాట్లాడుతూ గడిచిన 75 ఏళ్ల చరిత్రలో భారత దేశం సాధించిన పురోగతి, గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను సవివరంగా వివరించారు. స్వాతంత్ర్య సమరయోధులు సాధించి పెట్టిన ఈ స్వాతంత్రం మనమందరం చట్టాలను గౌరవించి, ప్రభుత్వాల మార్గదర్శకాలు పాటించినప్పుడే దేశం మరింత పురోగతి సాధిస్తుంది అని తెలిపారు. కళాశాలలో విద్యార్థులు బాగా చదువుకొని, నైపుణ్యాభివృద్ధి సాధించి ఉన్నత స్థానాలకు ఎదగాలని పేర్కొన్నారు. గడిచిన సంవత్సర కాలంలో ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలం పురోగతి మరియు కళాశాల విద్యార్థులు సాధించిన ర్యాంకులు, ఉద్యోగాలు, విజయాలు, కళాశాలకు నూతనంగా సమకూరిన ప్రయోగశాలల యంత్రాలు గురించి తెలియ చేసి, మరికొద్ది రోజుల్లో ప్రతిష్టాత్మక ఆహార ప్రాసెసింగ్ కంపెనీల్లో ట్రైనింగ్ కు వెళ్ళబోతున్న నాల్గొవ సంవత్సర విద్యార్థులుకు శు భాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సర విద్యార్థినిలు పాడిన దేశ భక్తి పాట అందరిని ఆకట్టుకుంది. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యత గురించి పలువురు విద్యార్థులు కార్యక్రమంలో ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్. ఎమ్. మాధవ, అధ్యాపకులు శ్రీమతి అరుణ, డాక్టర్ కీర్తి రెడ్డి, డాక్టర్. జయమ్మ, డాక్టర్ నివేదిత, డాక్టర్ సాయి శ్రీనివాస్, డాక్టర్. జాకిర్ బాషా, కె. సుబ్బారెడ్డి, పీ.డి డాక్టర్ రాజశేఖర్, లైబ్రరీ సిబ్బంది శ్రీమతి సుధారాణి, విద్యార్థులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో
## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



పులివెందుల : పులివెందుల టిడిపి కార్యాలయంలో ఆదివారం తుంగభద్ర ప్రాజెక్ట్ హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా లిమారెడ్డి జోగిరెడ్డి మాట్లాడుతూ మన రాజ్యాంగం చాలా గొప్పదనిమన దేశం సర్వసత్తాక గణతంత్ర దేశంగా ఆవిర్భవించిన పర్వదినం జనవరి 26. గణతంత్ర దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియచేస్తున్నాను. 75 సంవత్సరాలుగా రాజ్యాంగం మన దేశానికి సమగ్రంగా మార్గ నిర్దేశనం చేస్తోంది. రాజ్యాంగ స్ఫూర్తిని అజరామరంగా వర్ధిల్లేలా చేయడం మనందరి బాధ్యత. మన దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయుల స్ఫూర్తిని. రాజ్యాంగ రచన చేసి గణతంత్ర రాజ్యంగా అవతరించడం కోసం జ్ఞాన సంపదను ధారపోసిన మేధావుల ఆదర్శాలను ప్రతి ఒక్కరం అందిపుచ్చుకోవాలి. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వృద్ధులకు రక్త గ్రూప్, రక్తహీనత పరీక్షలు



లింగాల : లింగాల మండలం ఇప్పట్ల సమీపంలోని లీలావతి వృద్ధాశ్రమం లో 76 వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో శ్రీ లక్ష్మి వినాయక క్లీనికల్ ల్యాబ్, మథర్ థెరిస్సా క్లీనికల్ ల్యాబ్ ల సహకారం తో లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమం లోని వృద్ధులకు ల్యాబ్ టెక్నీషియన్ లు రాఘవరెడ్డి, మహమ్మద్ రఫీ లు రక్త గ్రూప్ నిర్ధారణ మరియు రక్తహీనత పరీక్షలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఆశ్రమం నిర్వాహకులు రసూల్, నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## 10 సూత్రాలతో రాబోయే ఐదేళ్లలో జిల్లా తలసరి ఆదాయాన్ని
# రెట్టింపు చేసే దిశగా ప్రణాళిక రూపొందించి కృషి చేస్తున్నాం

**జిల్లాను అన్నిరంగాలలో అగ్రస్థానంలో ఉంచుతాం**
**జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్**
**పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో వైభవంగా**
**76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు**
**జాతీయ పతాకావిష్కరణ చేసి,**
**జాతీయ గీతాలాపన చేసిన జిల్లా కలెక్టర్**





పుట్టపర్తి, : శ్రీ సత్య సాయి జిల్లాలోని, పుట్టపర్తి నందు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా ముందుగా జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ జాతీయ పతాకావిష్కరణ చేసి, జాతీయ గీతాలాపన చేశారు. తదనంతరం పెరేడ్ వీక్షణ చేసి సాయుధ దళాల నుంచి గౌరవ వందనాన్ని జిల్లా కలెక్టర్ స్వీకరించారు. అంతకుముందు పోలీస్ పెరేడ్ గ్రౌండ్ కు చేరుకున్న జిల్లా కలెక్టర్ కు జిల్లా ఎస్పీ పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయ్ సారధి, అడిషనల్ ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవ సందేశాన్ని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ చదివి వినిపించారు. అందరికీ నమస్కారం.. 76వ గణతంత్ర దినోత్సవ శుభ సందర్భంగా ఈ వేడుకలలో పాల్గొనటానికి విచ్చేసిన స్వాతంత్ర్య సమర యోధులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, అనధికారులకు, విద్యార్థినీ విద్యార్థులకు, పాత్రికేయులకు, జిల్లా ప్రజలందరికీ హృదయపూర్వక గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనీయుల వీరోచిత పోరాటాలు, అపురూప త్యాగాల ఫలంగా సిద్ధించిన స్వతంత్ర భారతావని లౌకిక, ప్రజాస్వామ్య, సార్వభౌమ, గణతంత్ర దేశంగా 1950 జనవరి 26వ తేదీన అవతరించిందన్నారు. అందుకే ప్రతి సంవత్సరం జనవరి 26వ తేదీని గణతంత్ర దినోత్సవంగా మనం సగర్వంగా జరుపుకుంటున్నామన్నారు. శ్రీ సత్య సాయి జిల్లాకు ఆంధ్రప్రదేశ్ చిత్రపటంలో ప్రత్యేక స్థానం ఉంది. అమూల్యమైన ఆధ్యాత్మిక, సామాజిక సేవల ద్వారా మొత్తం ప్రపంచాన్నే పుట్టపర్తికి రప్పించిన ఆధ్యాత్మిక గురువు శ్రీ సత్యసాయి నడయాడిన నేల ఇది. పుట్టపర్తి జిల్లా కేంద్రంగా వెలసిన శ్రీ సత్య సాయి జిల్లా ఆదర్శవంతమైన వ్యవసాయ పద్ధతులకు, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన చారిత్రక, ఆధ్యాత్మిక, శిల్పకళా వైభవానికి, సేవా భావానికి ప్రతీకగా నిలుస్తోంది. ప్రాచీన కళల కాణాచిగా విరాజిల్లుతోంది. మానవాళికి మంచిని బోధించిన అమృత మూర్తులు నడయాడిన పవిత్రమైన నేల ఇది. ఇక్కడ ప్రాచీన కళలు, సాంస్కృతిక వైభవం, పర్యాటక విశేషాలు, పురాతన ఆలయాలు ఎన్నో ఉన్నాయి. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన తిమ్మమ్మ మర్రిమాను, లేపాక్షి, పెనుకొండ గగన్ మహల్, బాబయ్య స్వామి దర్గా, పుట్టపర్తి ప్రశాంతి నిలయం, కదిరి ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయం, ప్రజా కవియోగి వేమన సమాధి, తోలుబొమ్మలు, కియా పరిశ్రమ, హిందూపురం హ్యాండ్లూమ్స్, ధర్మవరం పట్టు... ఇలా ఎన్నో విశేషాలు అడుగడుగునా అగుపిస్తాయి. ఐదేళ్లలో పేదరికంలేని సమాజం.. 2047 నాటికి నూరుశాతం అక్షరాస్యత.. తలసరి ఆదాయం 3,200 డాలర్ల నుంచి 42,000 డాలర్లకు పెంచడం.. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 2.4 ట్రిలియన్ డాలర్లకు వృద్ధి చేయడం.. రాష్ట్ర ప్రజల సగటు ఆయుఃప్రమాణాన్ని 85 ఏళ్లకు పెంచడం.. నియోజకవర్గానికి ఒక పారిశ్రామిక పార్కు ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడము ప్రజలు, ప్రభుత్వం, ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్ర సుస్థిరాభివృద్ధివంటి సమున్నత లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రాన్ని13- 12-2024వ తేదీన విజయవాడ నందు గౌరవ ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, రైతులు, ప్రజల సమక్షంలో గౌరవ ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు విడుదల చేయడమైనది. అందులో భాగంగా మన జిల్లాకి సంబంధించి ప్రతి ఆర్థిక సంవత్సరమునకు లో 15% పెరుగుదలను సాధించుటకు అనగా ప్రస్తుతం వున్న ?. 44,059 5 ?? 2028-29 . 97,316 5 డిస్ట్రిక్ట్ విజన్ యాక్షన్ ప్లాన్ 2024-29ను తయారు చేయడమైనది. అనగా జిల్లాలో 2022- 23 సంవత్సరంలో వున్న తలసరి ఆదాయం రూ.1,98,880/ నుండి 2028-29 సంవత్సరం నాటికి తలసరి ఆదాయం రూ. 4,32,189/ - సాదించడానికి ప్రణాళికలు తయారుచేయడమైనది.



వ్యవసాయ శాఖ

### 1. విత్తన పంపిణి వివరాలు:

2024-25 ఖరీఫ్ మరియు రబీ సీజనులలో 104874 క్వింటాళ్ళ వేరుశనగ, కందిపప్పు, శనగ మరియు రాగి విత్తనాలను రూ.39.79 కోట్ల రాయితీతో 128231 మంది రైతులకు సరఫరా చేయడం జరిగినది.

2. పంట ఋణాలు 455761 మంది రైతులకు రూ.6647 కోట్ల పంట రుణాలను బ్యాంకుల ద్వారా అందించడం జరిగినది.

3. ప్రత్యామ్నాయ పంటలు :

ఖరీఫ్ 2024 నందు పంటలు వేయని మిగులు భూములలో 15009 క్వింటాళ్ళ ప్రత్యామ్నాయ పంట విత్తనాలను 80% రాయితీపై రూ.10.60 కోట్ల సబ్సిడీతో రైతులకు సరఫరా చేయడమైనది.



4. -పంట నమోదు : జిల్లాలో ఖరీఫ్ 2024-25 నందు 207758 హెక్టార్లలలో రబీలో ఇప్పటి వరకు 21685 హెక్టార్లలో -పంట నందు నమోదు చేయడమైనది. దీనివలన రైతులకు వడ్డీలేని ఋణాలు, ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన, ఇన్ పుట్ సబ్సిడీ మరియు పంట కొనుగోలు వంటి పథకాలు వర్తిస్తాయి. సామాజిక వన విభాగము:-2024-25 సం. గాను పథకము క్రింద రూ. 916.18 లక్షలతో, 30 లక్షల మొక్కలు నర్సరీలలో పెంచి ప్రజలకు ఉచితంగా పంచడం జరుగుతుంది.

### గిరిజన సంక్షేమ శాఖ

జిల్లాలోవున్న 11 వసతి గృహములలో 1,950 మంది విద్యను అభ్యసించుచున్నారు. సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్ పరీక్షలలో పాసైన గిరిజన విద్యార్థికి ప్రోత్సాహక బహుమతిగా రూ.1 లక్ష అందచేయడమైనది. సాంఘిక సంక్షేమ శాఖ జిల్లాలో ఉన్న 26 వసతి గృహముల మౌలిక వసతులు కల్పించటకై రూ.585.91 లక్షలు మంజూరు చేశారు. ఈ సంవత్సరము 10వ తరగతి పబ్లిక్ పరిక్షలలో 90.91 % ఇంటర్మీడియట్లో 76.54 % ఉత్తీర్ణత సాధించడమైనది. 4,468 డప్పు మరియు 2,340 చర్మ కళాకారులకు నెలకు రూ. 4,000/- చొప్పున పెన్షన్ ఇచ్చుచున్నాము. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమము మరియు సాధికారిత శాఖ జిల్లాలో 44 ప్రీ మెట్రిక్ వసతి గృహములలో 4,147 మంది 13 పోస్ట్ మెట్రిక్ వసతి గృహములలో 1,114 మంది విద్యార్థులు విద్యను అభ్యసించుచున్నారు జిల్లా వెనుకబడిన తరగతులు సేవా సహకార సంఘం : బి.సి. స్వయం ఉపాధి పథకం: ఈ ఆర్థిక సం.లో రూ.28.02 కోట్లతో 1,472 మంది లబ్ధిదారులకు 50% సబ్సిడీతో రూ.14.01 కోట్ల సబ్సిడీ మరియు రూ. 14.01 కోట్ల బ్యాంకు రుణము మంజూరు చేయడమైనది. ఇ-బి.సి స్వయం ఉపాధి పథకం :ఈ ఆర్థిక సంవత్సరంలో 187 మంది బి.సి యువతకు 50% సబ్సిడీతో రూ.1.62 కోట్ల సబ్సిడీ మరియు రూ.1.62 కోట్ల బ్యాంకు రుణాలు మంజూరు చేయడమైనది. చంద్రన్న స్వయం ఉపాధి /కాపు స్వయం ఉపాధి పథకం: 345 మంది లబ్ధిదారులకు 50% సబ్సిడీతో రూ.5.80 కోట్ల సబ్సిడీ మరియు రూ 5.80 కోట్ల బ్యాంక్ రుణము మంజూరు చేయడమైనది జనరిక్ ఫార్మసీ యూనిట్ల పథకము : ఈ పథకం క్రింద బి.సి మరియు కాపు యువతకు మెడికల్ షాప్ లు ఏర్పాటుకై 62 మందికి రూ.2.48 కోట్ల రుణాలు మంజూరు చేయడమైనది. విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ పరికరాలు :2024-25 వ ఆర్థిక సం.లో 117 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.2.13 లక్షల విలువ గల ఉపకరణాలు మంజూరు ఆర్థిక పునరావాసం ): 2024-25వ ఆర్థిక సం.లో 22 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.55.43 లక్షలు మంజూరు చేయడమైనది.

### స్త్రీ, శిశు సంక్షేమ శాఖ :

జిల్లాలో 2,207 మెయిన్ అంగన్వాడీ కేంద్రాలు, 617 మినీ అంగన్వాడీ కేంద్రముల ద్వారా ఆరు నెలల నుండి ఆరు సంవత్సరాల వయస్సు కలిగిన 1,08,752 పిల్లలకు పౌష్టిక ఆహారము పంపిణీ చేయడమైనది. బాల సంజీవిని సంపూర్ణ పోషణ పథకము : ఈ పథకము కింద 23,441 మంది గర్భవతులకు మరియు బాలింతలకు కిట్స్ ప్రతినెల పంపిణీ చేయడం జరుగుతున్నది.

### గృహహింస నుండి మహిళలకు రక్షణ చట్టము 2005 :

ఈ చట్టం క్రింద 28 కేసులు నమోదు కాగా 3 కేసులు రాజీ అయినవి. 22 కోర్టునకు సమర్పించగా, 3 కేసులు విచారణలో ఉన్నవి. సమగ్ర బాలల పరిరక్షణ పథకం క్రింద 73 బాల్య వివాహాలు నిలుపుదల చేయడమైనది.

### సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ డిపార్ట్మెంట్ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యవసాయ, వ్యవసాయేతర, గ్రామకంఠం స్థిరాస్తుల సర్వే కొరకు ఆంధ్రప్రదేశ్ రీసర్వే ప్రాజెక్టును ప్రారంభించడం జరిగినది. ప్రయివేట్ డ్రోన్ల సహాయంతో ఇప్పటి వరకు 370 గ్రామాలలో 6,716.96 ద్వారా పూర్తిచేయడమైనది. రీసర్వేలో భాగంగా 4 లలో కలిపి 161 గ్రామాలకు 13 నోటిఫికేషన్సు జారీ చేయడమైనది.జిల్లాయందు ప్రతి మండలం నుంచి ఒక గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, అందులో గ్రామ సరిహద్దు సర్వే, ప్రభుత్వ భూముల సర్వే పూర్తి చేసి, జనవరి 20వ తేదీ నుండి భూ నిజనిర్ధారణ జరుగుతుంది. రీసర్వేలో ఉత్పన్నమయ్యే అభ్యంతరాలను పరిష్కరించటానికి జిల్లాయందు ప్రతి మండలానికి మొబైల్ మేజిస్ట్రేట్ ఏర్పాటు చేయడం జరిగినది. ప్రతి సర్వే నంబరును ఉచితముగా సర్వేచేసి భూమి సరిహద్దురాళ్ల ఖర్చులను కూడా ప్రభుత్వమే భరిస్తుంది.

### బ్యాంకులు :

31-12-2024 నాటికి అన్ని బ్యాంకులు కలిపి రూ.7,893 కోట్లు వ్యవసాయ రంగమునకు ఋణాలు పంపిణీ చేయడమైనది మరియు అన్ని ప్రాధాన్యత రంగాలకు మొత్తము రూ. 11,316 కోట్ల ఋణాలు మంజూరు చేయడమైనది.ప్రజా పంపిణీ వ్యవస్థ ఒక్క మనిషికి 5 కిలోల చొప్పున బియ్యము, అర (½) కిలో పంచదార, 1 నుండి 3 కేజీల జొన్నలు లేదా రాగులు మరియు 1 కిలో కందిపప్పు జిల్లాలో వున్న 5,72,609 రేషన్ కార్డుల ద్వారా పంపిణీ చేయుచున్నాము. జిల్లాలో వున్న రేషను కార్డు దారులకు ప్రతి ఏటా 100.49 కోట్ల రూపాయలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వము వారు సబ్సిడీ అందచేయుచున్నారు.

### దీపం పథకం -2 :

ఈ పథకం 29 అక్టోబరు 2024న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రము అంతటా ప్రారంభము 29-10-2024 2 16-01-2025 3,11,324 గ్యాస్ రీఫిల్స్ బుకింగ్ జరుగగా. 3,06,893 లబ్ధి దారులకు నేటి వరకు 24.58 కోట్ల రూపాయలు సబ్సిడీ జమ చేయడమైనది. మొదలైన సంక్షేమ పథకాలను ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రివర్యులు పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, తదితరులు, అన్ని శాఖల శాఖాధిపతులు తదితరులు పాల్గొన్నారు.

## వైయస్ఆర్ సీపీ ఆధ్వర్యంలో
## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



పులివెందుల : పులివెందుల లోని స్థానిక భాకరాపురం లోని జగన్ సార్ క్యాంపు కార్యాలయం లోఆదివారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 76వ గంతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది ,ఈ కార్యక్రమంలో ముందుగా మునిసిపల్ ఇంచార్జ్ వైయస్ మనోహర్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేసి జెండా వందనం స్వీకరించారు, కార్యక్రమం లో నాయకులు భారత రాజ్యాంగం మరియు స్వతంత్ర ఉద్యమ నాయకుల గురించి కొనియాడారు, తదనంతరం కార్యకర్తలకు నాయకులకు శుభాకాంక్షలు తెలియచేసి స్వీట్లు పంపిణీ చేసారు, కార్యక్రమం లో వైఎస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## సంసిద్ సతీష్ రెడ్డి స్కూల్లో
## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



వేంపల్లి : వేంపల్లి పట్టణంలోని సంసిద్ధ సతీష్ రెడ్డి పాఠశాలలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ రాజ్యసభ సభ్యులు తులసి రెడ్డి జాతీయ పథకాన్ని ఎగురవేశారు. గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను ఆయన విద్యార్థులకు వివరించారు గణతంత్ర దినోత్సవం భారతదేశం యొక్క గొప్ప ప్రజాస్వామ్య విలువలకు సంబంధించిన వేడుకని మన రాజ్యాంగాన్ని రూపొందించినప్పటి నుంచి దానిని స్వీకరించే వరకు భారతదేశం ప్రతి పౌరుడి స్వరానికి నిజంగా విలువనిచ్చే గణతంత్ర రాజ్యంగా అవతరించిందన్నారు. భారతదేశం విభిన్న సంస్కృతులు, భాషలు, మతాలు శాంతియుతంగా సహజీవనం చేసే అపారమైన వైవిధ్యభరితమైన భూమి. గణతంత్ర దినోత్సవం మనకు భిన్నత్వంలో ఏకత్వాన్ని గుర్తు చేస్తుందన్నారు. ప్రతి పౌరుడు సామరస్యంతో జీవించడానికి మన రాజ్యాంగం పునాది వేసింది. ఈ రోజు మనం ఈ చారిత్రాత్మక దినాన్ని జరుపుకుంటున్నప్పుడు ఈ వైవిధ్యాన్ని స్వీకరించి ఐక్యమైన, సంపన్నమైన భారతదేశం కోసం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమం లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులు ఆసక్తికరంగా చూసి ఆనందించారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ,వైస్ ప్రిన్సిపాల్ పరిమళ దేవి,లోకేష్,రాయుడు అధ్యాపకులు పాల్గొన్నారు.

## శ్లోక స్కూల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు..



వేంపల్లి : వేంపల్లి శ్లోక స్కూల్లో గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పాఠశాల కరస్పాండెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి మాట్లాడుతూప్రతి ఒక్కరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. గణతంత్ర దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే కాదనీ మన రాజ్యాంగంలో పొందుపరిచిన విలువలను గుర్తుచేస్తుందన్నారు. ఈ రోజున భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రోజనీ ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులతో సాధికారత కల్పిస్తుందన్నారు ఇది మనమందరం గర్వించాల్సిన, గౌరవించవలసిన రోజని. స్వాతంత్ర్యం కోసం పోరాడి మన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది వేసిన మన స్వాతంత్ర్య సమరయోధుల కృషిని గుర్తించడం కోసం మనలో ప్రతి ఒక్కరి బాధ్యతను ప్రతిబింబించాలని అన్నారు. దేశం శాంతి, సమానత్వం, న్యాయంతో అభివృద్ధి చెందుతూనే ఉందన్నారు.మనమందరం మన దేశం యొక్క నిరంతర విజయానికి, అభివృద్ధికి తోడ్పడతామని ప్రతిజ్ఞ చేద్దాం అన్నారు ఈ కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్ రమేష్ తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు

## వేంపల్లి మేజర్ పంచాయితీ లో
## ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



**- గణతంత్ర దినోత్సవ స్ఫూర్తితో ఉత్తమ సేవలు అందించాలి సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు**

వేంపల్లె : స్థానిక పంచాయతీ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా సర్పంచ్ ఆర్.శ్రీనివాసులు త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సర్పంచ్ తో పాటు, వార్డుసభ్యులు, పంచాయతీ ఇఓ, సిబ్బంది గౌరవవందనం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ పూర్తి రాజ్యాంగబద్ధంగా పాలన సాగించుకునే రోజును గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటామని, అదే స్ఫూర్తితో మరింత ఉత్తమ సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో

# గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు



: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఇల్లూరు గ్రామపంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ, భారత స్వతంత్ర పోరాట ఆశయాల నెరవేర్చడానికి దేశ ప్రజలందరూ ప్రజాస్వామ్యనీడలో సుభిక్షంగా సురక్షితంగా జీవించడానికి వీలుగా రూపొందిన రాజ్యంగం అమల్లోకి వచ్చిన శుభదినం, రాజ్యాంగాన్ని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించారు అని, అలాగే భారత రాజ్యాంగం ప్రపంచంలో కెల్లా పెద్దది మరియు లిఖిత రాజ్యాంగం, రాజ్యాంగాన్ని రచించడానికి సుమారు రెండు సంవత్సరాల 18 నెలల 11 రోజులకు సమయం పట్టిందని అలాగే రాజ్యాంగం రచించడానికి సుమారుగా 64 లక్ష రూపాయలు ఖర్చు అయిందని రాజ్యాంగం అమలులోనికి వచ్చిన 1950 జనవరి 26తేదీన గుర్తుగా గణతంత్ర దినోత్సవం జరుపుకుంటామని ఈ తేదీన భారతదేశం పూర్తిగా లౌకిక ప్రజాస్వామ్యంగా దేశంగా రూపొందించబడిందని, రాజ్యాంగం ద్వారాఅందరికీ సమన్యాయం విద్య వైద్యం చేకూరుతాయని ఇది ఒక జాతీయ పండుగని ఇది మన అందరి పండుగని ఆయన తెలియజేశారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయరాముడు, విఆర్ఓ కుళ్లాయప్ప, మాజీ సర్పంచ్ సుంకన్న, వెల్ఫేర్ అసిస్టెంట్ నజీరు, తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవం మరియు రాజ్యాంగ దినోత్సవం శుభాకాంక్షలు



గార్లదిన్నె : గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉపాధ్యాయుడు నాగరాజు మాట్లాడుతూ భావి భారత పౌరులకు నాతోటి ఉపాధ్యాయుని , ఉపాధ్యాయుల కు మిత్రులకు మరియు శ్రేయోభిలాషుల అందరికీ 76వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు .ప్రతి సంవత్సరం స్వాతంత్ర్య సమరయోధుల గురించి వారి జీవితా చరిత్రల గురించి స్మరించుకుంటూ వున్నాం కానీ వారిని ఆదర్శంగా తీసుకొని మనలో ఎంతమంది దేశసేవ కోసం పాటు పడుతున్నాం ఒకసారి ఆలోచించండి, కావున ఇప్పటినుండి అయినా మనలో మార్పు తెచ్చుకొని దేశ సేవ కోసం మనవంతు కృషిచేద్దాం అని దేశసర్వతోముఖాభివృధికి పాటుపడదాం అని తెలియజేశారు. జై హింద్.

# 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు





: చిలమత్తూరు మండల జనసేన పార్టీ ఆధ్వర్యంలో జెండా ఎగురవేసి వేడుకలు నిర్వహించడం జరిగింది. అనంతరం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి భారత రాజ్యాంగం విశిష్టతను, గణతంత్ర రాజ్యాంగా భారతదేశం అవతరించడం వల్ల సామాన్యుల అభ్యున్నతికి ఏ విధంగా తోడ్పడుతుందో స్మరించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, జిల్లా కార్యదర్శి రమణ, మండల కన్వీనర్ చిన్నా ప్రవీణ్, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ మెంబెర్ అగ్గి శ్రీనివాసులు, బీజేపీ మండల కన్వినర్ హరి జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షులు లక్ష్మణ మూర్తి, శివ, మండల నాయకులు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిలు మనోహర్, కిరణ్, వేంకటాద్రి, మండల సంయుక్త కార్యదర్శులు సోము, ధర్మేంద్ర, రంగనాథ్, కళ్యాణ్, జగదీశ్, శశి, మరియు నాయకులు జనసైనికులు రమేష్ రెడ్డి, చరణ్, మహేష్ , మారుతీ, శంకర, నరసింహమూర్తి, ప్రసాద్, ఆనంద్, వెంకటేష్, పాల్గొన్నారు.

# రణస్థలంలో ఘనంగా 76 వ ఘణతంత్ర దినోత్సవం వేడుకలు





రణస్థలం : మండలంలో ప్రభుత్వ కార్యాలలలో, ప్రభుత్వ పాఠశాలలలో 76 వ ఘణతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలకేంద్రంలోగల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రదానోపాధ్యాయులు బి. రమణయ్య పథాకావిస్కరణచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఎందరో మహానుభావుల శ్రమ ఫలితమే నేడు ఎన్నో ఫలాలు అందుకుం టున్నామన్నారు. మండల పరిషత్ ఆవరణలో ఎం పి డి ఒ ఈశ్వరావు పథాకావిస్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం పి పి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జెడ్ పి టి సి సీతారాం, ఎఒ ధనుంజయరావు, ఈఒఆర్ డిఒ ప్రకాశ్ రావు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా రణస్థలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదానోపాధ్యాయులు బి. రమణయ్య ఆధ్వర్యంలో బారీ ర్యాలీ నిర్వహించారు.

# శ్రీ వివేకానంద హై స్కూల్ లో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు



సింహాద్రిపురం : 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు శ్రీ వివేకానంద హై స్కూల్ లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా సింహాద్రిపురం, కొండాపురం మండల ఎం.ఈ.ఓ.ఎం-1.శ్రీ ఎం.ఓబులేసు హాజరై, పతాక ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు మరియు పాఠశాలలో నిర్వహించిన క్రీడాపోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.పాఠశాల విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రీ కె. ఖాదరవలి, డైరెక్టర్ కె.ఎం .జాఫర్ సాహెబ్ మరియు హెడ్ మిస్టర్ ఎస్. షేహనాజ్ బేగం మరియు పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# తనకల్లు గవర్నమెంట్ హాస్పిటల్లో ఘనంగా గణతంత్ర దినోత్సవం వేడుకలు



తనకల్లు : తనకల్లు గవర్నమెంట్ 30 పడకల ఆసుపత్రిలో నేడు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగరవేసిన డాక్టర్ విజయ్ కుమార్, హాస్పిటల్ కమిటీ డైరెక్టర్ సోంపాలెం నాగభూషణం రిపబ్లిక్ డే దినోత్సవాన్నిఘనంగా జరుపుకున్న హాస్పిటల్స్ సిబ్బంది ఈ కార్యక్రమంలో డాక్టర్లు రమేష్ బాబు, భాస్కర్ నాయక్, సులోచన,డైరెక్టర్లు శ్రీనివాసులు, సురేష్ గోపి హాస్పిటల్స్ సిబ్బంది, నర్సులు శానిటైజర్ సిబ్బంది,టీడీపీ నాయకులు, క్లస్టర్లు చెరిపిటి రవి, పీజీ మల్లికార్జున, బాలిలేని రవి, ముస్తఫా వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు




తొండూరు : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తొండూరు యందు డాక్టర్ ఆరిపుల్లా ఆధ్వర్యం లో 76 వ గణతంత్ర దినోత్సవ వేడుకలు జరిగాయి. డాక్టరు సిబ్బంది తో కలిసి జండా వందన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగము వలన మనం సాధించుకున్న స్వాత్యంత్రం ,స్వేచ్ఛ దేశ పురోగతికి,అభివృద్ధికి దోహద పడా లి అన్నారు. మన ప్రధాన మంత్రి,మన ముఖ్యమంత్రి స్వప్నం 2047 వ సంవత్సరం నాటికి ప్రపంచము లో భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దాలని అలాగే ఆరోగ్య రంగం లో అందరికీ ఆరోగ్యం అందించి మాతా, శిశు మరణాలను తగ్గించాలని , సంక్రమణ , సంక్రమణ. వ్యాధుల లను తగ్గించి తద్వారా వచ్చే మరణాలను తగ్గించాలని,జీవన శైలి మార్పు, ఆహారంలో మార్పు లను అవలంబించాలని సమాజ ఆరోగ్యమే మన లక్ష్యంగా అందరం కలిసి ఐక్యంగా పనిచేద్దామని తెలిపారు. ఈ పర్వదిన సందర్భంగా ఏర్పాటు చేసిన పోటీల యందు రంగోలి ద్వారా సేవ్ గర్ల్ చైల్డ్,, క్షయ ముక్తిభారత్,అవయవదానం ప్రాధాన్యత,తల్లిపాల ప్రాధాన్యత పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రధానం చేసారు,ఈ కార్యక్రమం లో డాక్టర్ రేష్మా,కమ్యూనిటీ ఆరోగ్య అధికారిని విజయ, హెల్త్ ఎడ్యుకేటర్ మలయ్య,హెల్త్ సూపర్వైజర్ శశికళ మరియు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎర్ర చెరువుపల్లి ఎంపీపీ స్కూల్ నందు జాతీయ జెండా ఆవిష్కరించిన

## స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసులు.





తనకల్లు : తనకల్లు మండలం పరిధిలోని ఎర్ర చెరువుపల్లి. ఎంపీపీ స్కూల్ నందు గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం జరిగింది. స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యార్థులకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. పిల్లలకు దేశ నాయకులు గురించి ఈ విధంగా తెలిపారు బ్రిటీష్ పరిపాలన నుంచి విముక్తి పొందిన తరువాత భారత పౌరులందరినీ ఒక ప్రజాస్వామ్య వ్యవస్థలో నడిపించడానికి, స్వాతంత్ర్య పోరాట ఆశయాలను నెరవేర్చడానికి, రాజ్యాంగ పరిషత్తును ఏర్పాటు చేసి, ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని రూపొందించారు. ఇది జనవరి 26, 1950 నుంచి అమలులోకి వచ్చింది. ఆనాటి నుంచి గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా వచ్చింది.

### నేటి తరానికి తెలుసా

గణతంత్ర దినోత్సవ ప్రత్యేకత ఏంటని ఈ తరం వారిని అడిగితే వారికి ఈ రోజు ఒక పబ్లిక్ హాలిడే. కుటుంబంతో, స్నేహితులతో సరదాగా గడిపే ఒక సెలవు రోజు. అంతకు మించి వారికేమి తెలియదు. ఈ జాతీయ సెలవు రోజున ఎంత మంది స్వాతంత్ర సమర యోధులను స్మరించుకుంటారంటే సమాధానం ఉండదు. దేశ స్వాతంత్రం మీద నేటి యువతకి ఎంత అవగాహన ఉంది. వాస్తవానికి భారత రాజ్యాంగాన్ని 1949 నవంబరు 26నే ఆమోదించారు. దీనిని అమలు చేసే తేదీకి ఒక ప్రాముఖ్యత ఉండాలనే ఉద్దేశంతో రెండు నెలలు వేచి ఉన్నారు. జలియన్ వాలాబాగ్ ఉదంతం తరువాత ఒక్కసారిగా కళ్లు తెరచిన భారత నేతలు లాహోర్ వేదికగా 1930 జనవరి 26న కాంగ్రెస్ పార్టీ జాతీయ సమావేశంలో తొలిసారిగా సంపూర్ణ స్వరాజ్యం తీర్మానం చేశారు. నెహ్రూ సారథ్యంలో రావీ నది ఒడ్డున త్రివర్ణ పతాకం ఎగురవేసి భారతీయుల స్వాతంత్ర సంకల్పాన్ని బ్రిటిషర్లకు గట్టిగా వినిపించారు. అంతటి చారిత్రక ప్రాధాన్యం ఉన్న తేదీకి చిరస్థాయి కల్పించాలన్న సదుద్దేశంతో నవభారత నిర్మాతలు రాజ్యాంగ రచన 1949లో పూర్తయినా, మరో రెండు నెలలు ఆగి 1950 జనవరి 26 నుంచి దానిని అమల్లోకి తెచ్చారు.



### ఇది మనమందరం గుర్తుంచుకోవాలి

ఏడాదికోసారి వేడుకలు జరుపుకొని మర్చిపోవడం కాదు గణతంత్ర దినోత్సవం అంటే ఏమిటి? ఎందుకు జరుపుకుంటున్నాం? రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులు ఏంటి? బాధ్యతలు ఏంటి? అనే విషయాలు కూడా అందరూ తెలుసుకోవాలి. హక్కులు కోసం పోరాడడం మాత్రమే కాదు బాధ్యతలు కూడా విస్మరించకూడదు. ఈ దేశం నాకు ఏమీ ఇవ్వలేదని పరాయి దేశాలకు పారిపోవడం కాదు. ఈ దేశం కోసం మనమేం చేయగలమో చేసి చూపించాలి. అప్పుడే భారత దేశం అభివృద్ధి చెందుతున్న దేశం కాకుండా అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుతుంది. అని అన్నారు .

### స్కూల్ టీచర్ మహేష్ మాట్లాడుతూ

ముఖ్యంగా యువత ఈ బృహత్తరమైన బాధ్యత స్వీకరించాలి. ఈ దేశమేగినా ఎందు కాలిడినా భరతమాత ముద్దు బిడ్డలమని మరువకూడదు. మన దేశం కోసం ఎలాంటి త్యాగమైన చేయడానికి సిద్ధంగా ఉండాలి జననీ జన్మ భూమిశ్చస్వర్గాదపి గరీయసి!అన్నట్లు కన్నతల్లిని జన్మభూమిని ఎన్నటికీ మరువకూడదు అని విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం పిల్లలకు కబ్బడి పోటీలు కోకో, జనరల్ నాలెడ్జ్ కోషన్స్ ,(క్విజ్ )రూపంలో నిర్వహించారు పిల్లలకు మొదటి బహుమతి తృతీయ బహుమతి, తృతీయ బహుమతిఅందజేశారు . ఈ కార్యక్రమంలో స్కూల్ హెడ్మాస్టర్ శ్రీనివాసులు, టీచర్ మహేష్, అంగన్వాడి టీచర్ కమలమ్మ, వర్కర్ అంగన్వాడి ఆయా అక్కయమ్మ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి





పరకాల : హనుమకొండ జిల్లా పరకాల పట్టణ కేంద్రంలోని అమరధామం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో టీపీసీసీ ఉపాధ్యక్షుడు దోమ్మటి సాంబయ్య తో కలిసి పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 1950 జనవరి 26న దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చిన సందర్భంగా గణతంత్ర దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది భారత రాజ్యాంగమని అన్నారు. ఈ రోజు ఏ దేశం వెళ్లిన భారతీయుల మని గర్వంగా చెప్పుకుంటున్నాం అంటే దానికి కారణం భారత రాజ్యాంగం యొక్క గొప్పతనం అని అన్నారు. గాంధీ మహాత్ముడు గ్రామ స్వరాజ్యం, ప్రజాపాలన రెండు కోరుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నాయకత్వంలో ప్రజాపాలన చూస్తున్నామన్నారు. గత ప్రభుత్వ పాలకులు కుటుంబ పాలన చేశారన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షాలకు కూడా బాధ్యత ఉంటుందని, ప్రతిపక్ష నాయకులు ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావలని, కానీ ఈ రోజుల్లో ప్రతిపక్ష పార్టీలు కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నాయని అన్నారు. ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు విరుద్ధమని అన్నారు. అదేవిధంగా పరకాల నియోజకవర్గ ప్రజలందరికీ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా దామెర మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డ్స్ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని అర్హులకు సంక్షేమ పథకాల పత్రాలను అందజేశారు. అంతకుముందు ప్రతిమ క్యాన్సర్ ఆసుపత్రి నుండి భారీ బైక్ ర్యాలీ నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ ప్రజలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నూతన పథకాలలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి పథకాలను ఈరోజు దామెర గ్రామ ప్రజల మధ్య పండుగ వాతావరణం లో ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. ఈనెల 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో ప్రజాపాలన గ్రామసభలు ఏర్పాటు చేసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయడానికి గ్రామ సభలో చర్చించుకోవడం జరిగిందన్నారు. అర్హులైన చిట్ట చివరి వ్యక్తికి సైతం లబ్ధిని చేకూర్చడానికి పై నాలుగు పథకాల ద్వారా లబ్ధి అందేలా నిరంతర మహా ప్రక్రియ అని అన్నారు. ప్రతి మండలంలోని ఒక గ్రామ పంచాయతీలో నేడు ప్రారంభించుకుంటున్నామని అన్నారు. రైతు భరోసా పథకం ద్వారా వ్యవసాయం చేసే రైతుకు వ్యవసాయ యోగ్యమైన భూమికి పెట్టుబడి సాయంగా 762 మంది రైతులకు రైతు భరోసా అందజేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ద్వారా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పనిచేసిన భూమిలేని వ్యవసాయ కూలీలకు 6వేల చొప్పున రెండు విడుదల సంవత్సరానికి 12 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. రేషన్ కార్డులు: వివిధ మార్గాల ద్వారా సేకరించిన రేషన్ కార్డు లేని లబ్ధిదారుల జాబితాను క్షేత్రస్థాయి పరిశీలన చేసి రేషన్ కార్డులు అందజేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు ద్వారా దారిద్ర రేఖకు దిగువ ఉండి ఇంట్లో లేని పేద కుటుంబాలకు, ఇంటి నిర్మాణం స్థలం కలిగి ఉన్న కుటుంబాలకు మొదటి విడతలో అందజేస్తామన్నారు. ప్రాధాన్యత క్రమంలో అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. రైతు బంధు పేరుతో గత ప్రభుత్వ పాలకులు ఖజానాను ఖాళీ చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకొని రాష్ట్రంలో మిగులు బడ్జెట్ ఉన్న నిధులను కాజేసీ ప్రజలకు అప్పు చూపడం జరిగిందని మండిపడ్డారు. ప్రజా పాలనలో, కులగన సర్వేలో వచ్చిన దరఖాస్తులను, అర్హులైన వారి వివరాలు గ్రామ సభలలో చదివి వినిపిస్తూ ప్రజల మధ్యలో ఎంపికకు ఈ ప్రభుత్వం కృషి చేస్తున్నదని అన్నారు.

# శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు



పులివెందుల : శిల్పారామం, పులివెందులలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కోలా ప్రసాద్ వారి సహకారంతో డ్యాన్స్ మాస్టర్ రాజా, శ్రీ రాజా కళా నిలయం ఆధ్వర్యంలో వారి చిన్నారులు దేశభక్తి గీతాలు నృత్యాలతో ప్రేక్షకులను ఎంతగానో అక్కట్టుకున్నారు. ముఖ్యంగా చిన్నారులు మా తెలుగు తల్లికి మల్లెపూదండ,మేమే ఇండియన్స్ మేమే ఇండియన్స్, దేశం మనదే తేజం మనదే.. ఎగురుతున్న జెండా మనదే దేశభక్తి గీతాలుకు వేసిన నృత్యం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. ఈ కార్యక్రమంలో స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పరిపాలన అధికారి సుధాకర్, ఫీల్డ్ సూపర్వైజర్ ఇస్మాయిల్, సుబ్బా రావు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా డాక్టర్. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ.



పరకాల: 76 వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని పరకాల సి.ఎస్.ఐ కాలనీలో మడికొండ బ్రదర్స్ ఏర్పాటు భారత రత్న డాక్టర్. బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరణ చేసిన అనంతరం పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాతీయ జెండా కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాసన సభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి, హాజరై జాతీయజెండా ఆవిష్కరణ చేశారు అనంతరం మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవం భారత రాజ్యాంగం రాయడానికి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అనేక ఇబ్బందులు ఎదుర్కొని దేశం కోసం అహర్నిశలు కష్టపడి రాజ్యాంగాన్ని రాయడం జరిగింది. అంబేద్కర్ అందరివాడు 1950 జనవరి 26 నాడు భారతదేశ రాజ్యాంగ వ్యవస్థను అమల్లోకి తీసుకొని రాజకీయ సమానత్వం సామాజిక ఆర్థిక జీవన దేశం సార్వభౌమ ప్రజాస్వామిక దేశంగా మరియు గణతంత్ర రాజ్యాంగ ప్రకటించుకుంది అంబేద్కర్ వ్యక్తిగతం అంటరానితనం నిర్మూలన పేదరిక నిర్మూలన ఓటు హక్కును కల్పించడం మన దేశానికి ఒక గొప్ప గణతంత్ర రాజ్యాంగాన్ని అందించిన మహా గొప్ప నేత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అని అన్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు దొమ్మాటి సాంబయ్య, కూడా చైర్మన్ ఇనగాల. వెంకట్రాంరెడ్డి, ఏఎంసి చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, శ్రీ భవాని కుంకుమేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ కొలుగురి రాజేశ్వర్ రావ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈర్ల చిన్ని, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షుడు కట్కూరి దేవేందర్ రెడ్డి, బూర దేవేందర్ గౌడ్, కొయ్యడ శ్రీనివాస్, ఒకటో వార్డు కౌన్సిలర్ మడికొండ సంపత్ కుమార్, నాయకుడు డాక్టర్. మడికొండ శ్రీను, బొల్లె బిక్షపతి, పాడి ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు పంచగిరి జయమ్మ పోరండ్ల సంతోష్ బండి సదానందం గౌడ్, ఒంటేరు సారయ్య అబ్బ శ్రీనివాస్ ఒంటేరు శ్రావణ్ మంద నాగరాజు బుర్ర రాజమౌళి పసుల విజయ రుద్రమదేవి భోగం కమల చంద్రమౌళి చందుపట్ల రాఘవరెడ్డి వసంత దాట్ల కోమల పరకాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఏఎంసి డైరెక్టర్లు ఇందిరమ్మ కమిటీ సభ్యులు వార్డు అనుబంధ సంఘాల నాయకులు ఇతర ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ముంటి మడుగుకేశవరెడ్డి కుటుంబానికి ఆర్థిక సాయం



గార్లదిన్నె : మరణించిన కుటుంబ సభ్యులకు 10000/- రూపాయలు ఆర్థికసాయం చేసిన సింగనమల నియోజకవర్గం ద్విసభ కమిటీ సభ్యుడు ముంటిమడుగుకేశవరెడ్డి అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గం గార్లదిన్నె మండలం పెనకచర్ల గ్రామంలో నివాసముంటున్న ఎరుకల సుబ్బయ్య మరణించిన విషయం తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి వారి కుమారుడు కి?10000/- రూపాయలు ఆర్థిక సహాయం చేసి వారి కుటుంబానికి అండగా నిలిచిన సింగనమల ద్వి సభ్య కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి ఈ కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రెవిన్యూ కార్యాలయంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

## ప్రజలంతా జాతీయ భావం పెంపొందించుకోవాలి



చిలమత్తురు : మండల ప్రజలంతా జాతీయ భావం పెంపొందించుకోవాలని తహసిల్దార్ వెంకటేష్ మాట్లాడుతూ 76వ గణతంత్ర దినోత్సవాన్ని పుష్కరించుకొని మండల కార్యాలయతో పాటు అన్ని గ్రామాలలో ఏర్పాటు చేసిన గణతంత్ర దినోత్సవ వేడుకలు ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణతంత్ర స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ గౌరవించాల్సిన అవసరం ఉందని తెలిపారు.రాజ్యాంగ సృష్టి కర్త డా: అబేద్కర్ సూర్తితో దేశ ఐక్యతను చాటుతూ ప్రతి ఒక్కరూ గణతంత్ర వేడుకలను జరుపుకోవాలని చూచించారు.అన్ని గ్రామ పాఠశాల,సచివాలయం కార్యాలయాలలో తివర్ణ పథకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేసి స్వీట్ ను పంచారు.ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ వెంకటేశ్ లు, డిప్యూటీ తహసీల్దార్,వీఆర్వో లు,గ్రామ కార్యదర్శి లు ,గ్రామికులు పాల్గొని వందేమాతరం వందేమాతరం అంటూ జండాను ఎగురవేశారు...

## కోడూరు ప్రభుత్వ ప్రాథమిక వైద్య కరువైన మౌలిక వసతులు



చిలమత్తూర్ : చిలమత్తూర్ మండలం కోడూరులోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాలలో మౌలిక వసతులు కరువయ్యాయి..అక్కడికి వచ్చే రోగులకు మంచాలపై బెడ్లు లేని అవస్థలు పడుతున్నారు.అధికారులు చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారు వైద్యశాలకు పక్కనున్న శేట్టిపల్లి చుట్టపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో వస్తుంటారు. ఐరెన్,సుక్రోజ్, గ్లూకోజ్, సెలైన్ బాటిల్స్ ఎక్కించడానికి తప్పని సరిగా మంచాలపై బెడ్లు ఉంటే సౌకర్యవంతంగా ఉంటాయని రోగులు మనవి చేసుకొంటున్నారు..వైద్య అధికారులు వెంటనే స్పందించే అవసరం ఉంది.

# బాలయ్యకు అభినందనలు తెలిపిన జనసెన మండల కన్వీనర్: చిన్న ప్రవీణ్



(చిలమత్తూర్) : హిందుపురం శాసనసభ్యులు నటసింహం నందమూరి బాలకృష్ణకు కళారంగంలో పద్మభూషణ్ వరించడాన్ని హర్షిస్తూ చిలమత్తూరు జనసేన పార్టీ మండల కన్వినర్ చిన్నా ప్రవీణ్ , జిల్లా కార్యదర్శి రమణ మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా సినీ రంగంలో విభిన్న పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తూ, అలాగే రాజకీయాల్లోనూ అనేక సేవకార్యక్రమాలు చేస్తూ, హిందూపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్న “నందమూరి బాలకృష్ణకు”మండల జనసేన పార్టీ తరుపున శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము

# అన్ని రంగాల్లో తండ్రికి తగ్గ తనయుడు :- పద్మభూషణ్ ముద్దుల బాలయ్య

కూటమి నాయకులు పద్మభూషణ్ ముద్దుల మామయ్యకు కేక్ కట్టింగ్

నటసింహం నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా మండల ప్రజలకు విజ్ఞప్తి




చిలమత్తూర్ : చిలమత్తురు మండల కూటమి కుటుంబ సభ్యులకు విన్నపం గౌరవనీయులు స్వర్గీయశ్రీ.నందమూరి తారకరామారావు ముద్దుల తనయుడు, సమాజమే దేవాలయం-ప్రజలే దేవుళ్ళు ,అన్న సాక్షాత్తు తెలుగు రాష్ట్రాల దేవుడులిహిందూపురం శాసనసభ్యులు శ్రీ.నందమూరి బాలకృష్ణకు కళల విభాగంలో కేంద్ర ప్రభుత్వం అత్యున్నత,ప్రతిష్ఠాత్మకమైన “పద్మభూషణ్”అవార్డును అందజేసిన సందర్భంగా రేపు అనగా సోమవారం ఉదయం 10.30 గంటలకు చిలమత్తూరులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్టింగ్,పూలమాలలు వేసి అభినందనలు తెలియ జేయడానికి ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయడమైనది.కావున చిలమత్తూరు కింద బస్టాండ్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు పెద్ద ఏత్తున ర్యాలీగా వెళ్లి అక్కడ పూలమాల వేసి బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేయాలి. కావున మండలంలోని కూటమి కుటుంబ సభ్యులు నాయకులు, కార్యకర్తలు,డీలర్లు,అభిమానులు ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలనీ మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను..మండల కన్వీనర్ రంగారెడ్డి

## ఎస్ డి పి ఐ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర వేడుకలు

### ఎస్ డి పి ఐ అధ్యక్షులు షేక్ అక్బర్ అలీ..




కడప : కడపలో ఎస్ డి పి ఐ కడప అసెంబ్లీ అధ్యక్షులు షేక్ అక్బర్ అలీ గారి ఆధ్వర్యంలో కడప ఎస్ డి పిఐ ఆఫీస్ నందు గణతంత్ర దినోత్సవం ఘనంగా జరిగినది. ఆదివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్రోద్యమంలో ఆంధ్ర ప్రాంత ముస్లింల పాత్ర అభినంద నీయమని కొనియాడారు. ఆంధ్ర ప్రాంత ముస్లింల అత్యధికంగా పాల్గొనడం వారి త్యాగాలను ఆంధ్ర వాసులు మర్చిపోవద్దు అని బ్రిటిష్ ధరలను ఈ దేశం నుండి తరిమి వేయడం కోసం తమ ప్రాణాలను లెక్కచేయకుండా బ్రిటిష్ దొరలను ఈ దేశం నుండి తరిమి వేయడం తమ ప్రాణాలను లెక్కచేయకుండా పోరాడా ఉన్నారు. ఈ కార్యక్రమంలో కడప అసెంబ్లీ సెక్రెటరీ షేక్ జాబిర్ అలీ, సెక్రటరీ షేక్ సమీర్ వైస్ ప్రెసిడెంట్ పి రఫీ ట్రెజరర్ షేక్ అబ్దుల్ రెహ్మాన్ పి యూసఫ్ కార్యకర్తలు ఈ రిపబ్లిక్ డే దినోత్స వం విజయవంతంగా జరిగినది

## 76వ గణతంత్ర దినోత్సవ జెండాను ఆవిష్కరించిన సిఐ నాగరాజు

### ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు



కడప : ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్, ఎం.డి.బహావుద్దీన్ కోశాధికారి అధ్యక్షతన గణతంత్ర దినోత్సవ వేడుకలు ఆల్మాస్‌పేట సర్కిల్ వద్ద ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప 2వ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగార్జున హాజరై జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతమైన మాట్లాడుతూ ప్రపంచంలోనే అతి పెద్ద రాజ్యాంగం మన భారత రాజ్యాంగం అని స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వాన్ని అందించిన రాజ్యాంగాన్ని మనందరం గౌరవించాలని ఆయన అన్నారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు అమీర్ బాబు ఆప్ కి ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ చాన్ బాషా, డాక్టర్ అబిద్, డాక్టర్ నిజాముద్దీన్ లు మాట్లాడుతూ,భారత రాజ్యాంగం అన్ని విధాలుగా అన్ని వర్గాలకు కలిసిమెలిసి ఉండేలా డాక్టర్ అంబేద్కర్ రచించారని రాజ్యాంగంపై గౌరవం లేని వారు చాలామంది ఉన్నారని పార్లమెంటు సాక్షిగా కొంతమంది వ్యవహరిస్తున్న తీరు చూస్తే బాధ కలుగుతున్నదని వారు అన్నారు. భారతదేశం స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహానుభావులను స్మరించుకుంటూ వివిధ నాయకులు మాట్లాడారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.జాతీయ గీతం ఆలపించి కార్యక్రమాన్నిముగించారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా మిల్లీ కౌన్సిల్ సభ్యులు కె. అన్సార్ అలీ ఖాన్, సంయుక్త కార్యదర్శి. సిటీ షహమీర్ జాయింట్ సెక్రటరీ మౌలానా మొగల్ మస్తాన్ బైగ్ సనై, షేక్ హిదాయతుల్లా, సయ్యద్ అర్షద్ అలీ సయ్యద్ అబ్దుల్ సత్తార్ జీలాన్ బేగ్, ఎస్.మక్బూల్ సికిందర్ హుస్సేన్ ఎస్.నౌషాద్ అలీ డా.రఫీ వివిధ నాయకులు, సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..

## చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



కడప : తెలుగు రాష్ట్రాల సమన్వయకర్త పేరు పోగు వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు ఫిబ్రవరి 5వ తేదీన నిర్వహించు చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎంఆర్పి ఎస్ రాష్ట్ర నాయకులు మునయ్య, జిల్లా అధ్యక్షుడు శివ ఆదివారం తెలిపారు. నగరంలోని ఎన్జీవో ఆవరణము నందు చలో విజయవాడ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ లక్ష్యసాధన కోసం ఉమ్మడి రాష్ట్రాల మాదిగ సంఘాలు జరగబోవు జాతీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పేట హరిబాబు, కార్యదర్శులు మిద్దె వెంకటరమణ, జిల్లా కార్యదర్శి నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి గండి పోగు శ్రీనివాసులు, వివిన్ పల్లి మండల అధ్యక్షుడు మస్తానయ్య, రామయ్య, చంద్ర, చెన్ రాయుడు తదితరులు పాల్గొన్నారు. కె డిపి చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

## స్టాఫ్ నర్సుకు ఉత్తమ ప్రశంశ పత్రం...



కడప : కడప జిల్లాలోని కాజీపేట మండలంలోని ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో స్టాఫ్ నర్స్ గా మెరుగైన వైద్య సేవలందించిన అబ్బరాజు సుప్రజకు జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని పొందారు. ఆదివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో 76 వ గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వైద్య శాఖల్లో ప్రతిభ కనపరిచిన ఉద్యోగులు, అధికారులకు జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె. నాగరాజు ప్రశంశ పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా సుప్రజ మాట్లాడుతూ ఈ ప్రశంశ పత్రము నా బాధ్యతలను మరింత పెంచిందని నేను అందించిన సేవలను గుర్తించి ప్రశంశ పత్రం అందజేసిన జిల్లా వైద్య అధికారి డాక్టర్ కె. నాగరాజుకు,పిహెచ్ సి మెడికల్ ఆఫీసర్లు కు కృతజ్ఞతలు తెలిపారు.తాను అధికారుల ఆదేశాలను అనుసరించి అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు.

## ఎస్పీతో ప్రశంషా పత్రం అందుకుంటున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఏం.చిన్నప్ప



కడప : అన్నమయ్య జిల్లాలో పనిచేస్తున్న ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎమ్ టి డ్రైవర్ ఎం.చిన్నప్ప సేవలను గుర్తించి ఎస్పీ విద్యాసాగర్ నాయుడు చేతుల మీదుగా హెడ్ కానిస్టేబుల్ మూలింటి చిన్నప్ప ప్రశంషా పత్రం అందుకున్నారు.

## రాజకీయ ఎదుగుదలకు కుట్ర

శింగనమల : శింగనమల నియోజకవర్గం లో దళిత ఎమ్మెల్యే అయిన నన్ను రాజకీయంగా కుట్రపడి సామాజిక మాధ్యమాల్లో నా పై దుష్ప్రచారం చేస్తున్నారని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. గత వారం రోజులుగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆడియో రికార్డులకు నాకు నా కుటుంబానికి తెలుగుదేశం పార్టీకి ఎటువంటి సంబంధం లేదని వివరించారు కూటమి ప్రభుత్వం అవినీతి అక్రమాలకు దూరంగా ఉంటుందని గుర్తు చేశారు ఇసుక అక్రమ రవాణా పై పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజునే ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశాను. ఇసుక అక్రమ రవాణా చేయడానికి ఎవరు ప్రయత్నించినా వారిని అడ్డుకొని అరెస్టులు చేయండని తెలిపాను. ఎమ్మెల్యే పేరు నా కుటుంబం పేరు చెప్పుకొని కొందరు అధికారులను భయపెడుతున్నారు. వారి వివరాలను తెలుసుకొని ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తున్నాము. ఈ నేపథ్యంలో నా రాజకీయ ఎదుగుదలను అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నంలో ఇలాంటి దుష్ప్రచారం సాగుతోంది. కార్యకర్తలు నాయకులు పార్టీ నాకు తోడుగా నిలుస్తుంది. అయితే దళిత మహిళ ఎమ్మెల్యేని అనే చిన్న చూపుతో కొన్ని దుష్టశక్తులు ప్రతిరోజూ నాపై ఏదో ఒక దుష్ప్రచారానికి ఓడి కడుతున్నారు. ఇసుక అక్రమ రవాణా అంటూ నాకు అంటగడుతున్నారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎన్ని కేసులు నమోదు అయ్యాయి అన్న విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. ఆరు మండలాల్లోన ఇసుకకు సంబంధించిన అనేకమైన కేసులు నమోదు చేశారు. పార్టీకి సంబంధించిన వారైనా వారి వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్లో ఉంచారు. ఇసుక అక్రమ రవాణా పై పోలీసులు చర్యలు తీసుకుంటున్న కొందరు పోలీసుల కళ్ళు కప్పి రవాణా చేస్తున్నారు. పోలీసులకు సైతం ఇసుక అక్రమ రవాణా పై కఠినంగా వ్యవహరించాలని ఆదేశాలు జారీ చేశాను. వాస్తవాలను నియోజకవర్గ ప్రజలు గమనించాలని కోరుతున్నాను.

## చిలమత్తూర్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు

### యస్.ఐ. మునిర్ మహ్మద్ చేతులమీదుగా జెండా ఆవిష్కరణ

**(కదిలించే వార్త) జనవరి 26:** మండల పరిదిలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక యస్.ఐ.మాట్లాడుతూ ఆటో యూనియన్ సభ్యులు దేశం మీద గౌరవం కలిగి ఉండాలని బస్సు సౌకర్యం లేని పల్లెలకు,ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నమంటే ఆటో సౌకర్యాల వలనే..అని ఆయన కొనియాడారు ఈ పండుగా మన అందరి జీవితాలలో వెలుగు నింపాలని ఆనందాలు వెల్లి విరిసేలా దేశం మరింత గర్వంగా చెప్పుకో తగ్గ అభివృద్ధి పథంలో ముందుకు నడిచేందుకు తోడ్పాటు అందించాలని కోరారు.ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభులకు ధన్యవాదాలు తెలిపారు.రహమతుల్లా ,తోటి మిత్రులు, పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అనంత సేవా రత్న, అవార్డ్ ను అందుకున్న యం.యం.డి.ఇమామ్.



అనంతపురం : అనంతపురం పెరేడ్ గ్రౌండ్ నందు ఆదివారం జరిగిన 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం, కులమతాలకు అతీతంగా విపత్కర పరిస్థితుల్లో అందించిన విశిష్ట సేవలకు ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యం.యం.డి.ఇమామ్ గారికి మైనార్టీ సంక్షేమ శాఖ ద్వారా జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఐఏఎస్ గారి చేతుల మీదుగా "అనంత సేవ రత్న అవార్డు" ను అందజేశారు. అవార్డు అందుకోవడం పట్ల జిల్లా అధికారులు, మైనార్టీ మత పెద్దలు, రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు, మిత్రులు అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జయింట్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, జిల్లా ఎస్పీ పి.జగదీష్, అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డి.ఆర్.ఓ. మలోలా, ఆర్.డి. ఓ. కేశవ నాయుడు, తహశీల్దార్ లు తదితరులు పాల్గొన్నారు. అనంతపురం జిల్లా వ్యాప్తంగా ముస్లిం మైనార్టీ డెవలప్మెంట్ అసోసియేషన్ ద్వారా మైనారిటీ ప్రజల సంక్షేమ అభివృద్దే లక్ష్యంగా వివిధ సేవా కార్యక్రమాలతో అహర్నిశలు కృషి చేస్తూ కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలకు అండగా నిలుస్తూ అందించిన విశిష్ట సేవలకు మరియు ప్రభుత్వ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులుగా ఎస్సీ, ఎస్టీ సమస్యలను పరిష్కారం చూపే దిశగా యాక్టివ్ గా పనిచేస్తూ 2024లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పొలిటికల్ స్టాండింగ్ కమిటీ సభ్యుడి గా ఉత్తమ సేవలు అందించి జిల్లా కలెక్టర్ గారిచే మరియు జిల్లా అధికారుల నుండి మన్ననలు అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఇమామ్ మాట్లాడుతూ ఒక సామాజిక బాధ్యతతో వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ ప్రజలకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ ఐ.ఏ.యస్ గారి చేతుల మీదుగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో "అనంత గుడ్ సామరిండ్ అవార్డు" పురస్కారాన్ని అందుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇక నుండి మరింత బాధ్యతగా అనంత ప్రజలకు అండగా నిలుస్తూ అన్ని వర్గాల ప్రజలకు ఆదర్శంగా సేవలు అందించడానికి ఈ అవార్డు నాకు ఎంతో దోహదపడుతుందని తెలిపారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన జిల్లా కలెక్టరు కు, అధికారులకు ఇమామ్ ప్రత్యేకంగా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు.



అనంతపురం : అనంతపురం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఘనంగా 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో గణతంత్ర నిర్వహించారు.స్వాతంత్రం ఉద్యమాల్లో పోరాడిన నాయకులను స్మరిచుకుంటూ జండా వందనం చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్.గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కలెక్టర్,డాక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం హర్షణీయం.

### -స్పందన ఆర్గనైజేషన్.



అనంతపురం : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా, స్పందన ఆర్గనైజేషన్ చేస్తున్న సేవలను గుర్తించి, అనంతపురం జిల్లా కలెక్టర్,డాక్టర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని స్పందన ఆర్గనైజేషన్ వారు తెలిపారు. గత,15 సంవత్సరాలుగా అన్నదానం, అనాధ శవాల అంత్యక్రియలు, ఫుడ్ బ్యాంక్,స్పందన క్యాంటీన్, స్పందన మానసిక వికలాంగుల కేంద్రం మరియు నిరుపేదలకు, అనాథలకు,దివ్యాంగులు, మహిళలు, మరియు పేద విద్యార్థుల కోసం వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలో మార్పుకు మద్దతుగా నిలుస్తునందుకు గర్వాంగా ఉంది . ఈ అవార్డు స్పందన టీమ్ సభ్యులకు , దాతలకు, శ్రేయోభిలాషులకు మరియు మమ్మల్ని నమ్మిన ప్రతి ఒక్కరికి చెందినదని తెలిపారు.

## అనంతను కలిసిన రైతు విభాగం అధ్యక్షులు.



అనంతపురం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతు విభాగం నగర అధ్యక్షులుగా ఎం.నాగేశ్వర్ రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా పార్టీ ముఖ్య నాయకులతో నాగేశ్వర్ రెడ్డి వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం రైతులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీ బలోపేతం కు కృషి చేయాలని సూచించారు.

## అంబేద్కర్ సెంటర్లో పథకావిష్కరణ చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



పరకాల : భారతదేశ 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ సెంటర్ లో రిపబ్లిక్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒంటేరు కుమార్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో 18వ వార్డు నాయకుడు ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మెంబర్ పసుల శ్రీనివాస్ అధ్యక్షత వహించగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒంటేరు కుమార్ మాట్లాడుతూ దేశసేవకు ప్రజలంతా పునరంకితం కావాల్సిన తరుణమిదని, స్వాతంత్ర్యం కోసం బలిదానం చేసిన వారిని స్మరించుకోవాలని, రాజ్యాంగ స్ఫూర్తిని దృష్టిలో ఉంచుకోవాలని, కాబోయే ప్రధాని రాహుల్ గాంధీ అంత్యోదయ స్ఫూర్తిగా అడుగులు వేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిపాలనలో



రాజ్యాంగ స్ఫూర్తితో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం అమల్లోకి తెచ్చిన అంబేద్కర్ కి మనం రుణపడి ఉన్నాము అని తెలిపారు. రాష్ట్రంలో సిఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం సుపరిపాలనతో నిలుస్తుందని స్థానిక పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి నేతృత్వంలో ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో గోవింద రవిందర్, ఏకు రవికుమార్, ఒంటేరు చరణ్ రాజ్, ఒంటేరు, రమేష్, మచ్చ సందీప్, పసుల లక్ష్మణ్, కె పాణి, పసుల జనార్ధన్, మాదాసి సృజన్, జితేందర్,రజింత్,తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురంలో, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఘనంగా 76వ గణతంత్ర వేడుకలు.

అనంతపురం : జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన వైసీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి..



హాజరైన మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, మేయర్ మహమ్మద్ వసీం, ఇతర ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపిన అనంత వెంకటరామిరెడ్డి 2019 నుంచి 2024 వరకు రాష్ట్రంలో వైఎస్ జగన్ నాయకత్వంలో అంబేద్కర్ స్ఫూర్తితో అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించామన్న అనంత వెంకటరామిరెడ్డి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందన్న అనంత వెంకటరామిరెడ్డి కేంద్రం ప్రభుత్వం అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజల హక్కులను కాపాడాలి.

## అనంతను కలిసిన చేనేత విభాగం అధ్యక్షులు.



అనంతపురం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం నగర అధ్యక్షులుగా దేవాంగం రామయ్య నియమితులయ్యారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున నాయకులతో రామయ్య వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## నందమూరి బాలకృష్ణ కి ప్రఖ్యాత పద్మభూషణ్,అవార్డు ప్రకటించిన సందర్భంగా అభిమానులు కేక్ కట్ చేశారు.



అనంతపురం : కేంద్ర ప్రభుత్వం నందమూరి బాలకృష్ణ కి ప్రఖ్యాత పద్మభూషణ్ అవార్డు ప్రకటించిన సందర్భంగా అనంతపురం నగరంలోని అన్న నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద అనంతపురం నగర నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నగర అధ్యక్షుడు శ్రీధర్ రాయల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నందమూరి అభిమానులు మరియు నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసి అభినందనలు తెలియజేశారు. కేక్ కట్ చేసి నందమూరి బాలకృష్ణ అభిమానులు సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీదర్ రాయల్ మాట్లాడుతూ మొదటి రోజున విడుదలైన బాలకృష్ణ గారి టాపిక్ మహారాజ్ చిత్రం పండ విజయం సాధించి రెండు రోజుల క్రితమే అనంతపురం నగరంలో విజయోత్సవ వేడుక



జరుపుకోవడం జరిగిందని, ఆ సంబరం మర్చిపోకముందే బాలకృష్ణకి పద్మభూషణ్ అవార్డు రావడం అభిమానులకు అంతులేని ఆనందాన్ని ఇచ్చిందని, ఆయన సినీ రంగంలోనే కాకుండా రాజకీయ రంగంలోనూ వైద్యరంగంలోను ఎనలేని సేవలు అందిస్తున్నారన్నారు. తమ అభిమాన నటులు బాలకృష్ణ ఇలాగే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని మరిన్ని అవార్డులన్నీకోవాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులు గోపాల్, సుధాకర్, రవి, చిరంజీవి, రఘు, హర్ష, తాటి మధు, శంకర్, దబ్బర కుమార్, హరీష్ రెడ్డి, రామక్రిష్ణ, ఇర్షాద్, గౌస్, బాలకృష్ణ, రఫీ, మహాలక్ష్మి శివ, గొంట్ల రమేష్, బాబు, తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

## డి యం హెచ్ ఓ కార్యాలయంలో ఘనంగా రిపబ్లిక్ డే వేడుకలు.

అనంతపురం : 76వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ బీ దేవి జండా వందనం చేయడం జరిగింది. అనంతరం జరిగినటువంటి కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఈ బి దేవి, మాట్లాడుతూ ఎందరో మహనీయుల వీరోచిత పోరాటం ద్వారా దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత వార్తావని లౌకిక ప్రజాస్వామ్య సార్వభౌమ గణతంత్ర దేశంగా 1950 జనవరి 26వ తేదీన అమల్లోకి వచ్చిందని తద్వారా ప్రతి సంవత్సరం జనవరి 26వ తేదీన గణతంత్ర దినోత్సవం గా మనం జరుపుకుంటున్నామని ప్రజలందరికీ సమాన హక్కులు అవకాశాలను కల్పిస్తూ భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందించిన



పవిత్ర రాజ్యాంగం మనందరికీ సమాన అవకాశాలు హక్కులు కల్పించబడ్డారని తెలియజేశారు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం సంపన్న ఆరోగ్య మరియు ఆనందమైన ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు పది సూత్రాలతో స్వర్ణాంధ్ర 2047 డాక్యుమెంట్ను ఆవిష్కరించి అభివృద్ధి పరుస్తున్న క్రమంలో మనమందరం పాలుపంచుకొని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందిని కోరారు, ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖలో పనిచేసే అన్ని క్యాడర్ల సిబ్బందికి రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలియజేశారు, అనంతరం మెరుగైన వైద్య సేవలు అందించిన సిబ్బందికి డిపార్ట్మెంటల్ప్రశంసాపత్రాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారులు డా. యుగంధర్, డా. అనుపమ జేమ్స్, డా. నారాయణస్వామి, డా. గంగాధర్ రెడ్డి, ఏవో గిరిజ మనోహర్ రావు, డిఎంఓ ఓబులు, డెమో త్యాగరాజు, ఆరోగ్య బోధనా అధికారి గంగాధర్, మినిస్ట్రీయల్ సిబ్బంది విజయ భాస్కర్ రెడ్డి శ్రీనివాసులు,పవన్,సురేష్, కమలాకర్,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆకట్టుకున్న పోలీసు జాగిలాల విన్యాసాలు

### తిలకీంచిన జిల్లా కలెక్టర్, ఎస్పీ లు, ప్రముఖులు



అనంతపురం, : స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పోలీసు జాగిలాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



పోలీసు జాగిలాలైన లియో, వాగా, షైనీ, విక్కీలు ముందుగా ఈ వేడుకలకు ముఖ్య అతిథి అయిన జిల్లా కలెక్టర్ శ్రీ వినోద్ కుమార్ వి కి, జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ కి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికాయి. అనంతరం గౌరవ వందనం చేశాయి. విన్యాసాలులో భాగంగా... మత్తుపదార్థాలు ఉంచిన బాక్సులను వెలికి తీశాయి. పెద్ద పెద్ద ప్రమాదాలను తప్పించడానికి ఈ నైపుణ్యం ఉపయోగపడుతుంది. ఆతర్వాత తన కర్తవ్య నిర్వహణలో భాగంగా ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటకుంటూ లక్ష్యాన్ని ఛేదించేందుకు ఉపయోగపడే హార్డిల్స్ జంపు విన్యాసాలను సులువుగా చేశాయి. అనంతరం... అపరిచిత వ్యక్తులు ఇచ్చే ఆహారాలను పోలీసు జాగిలాలు స్వీకరించకుండా తిరస్కరించే విన్యాసం వీక్షకులను ఆకట్టుకుంది. ఈ నాలుగు జాగిలాలు పేలుడు పదార్థాలు, మాదక ద్రవ్యాలను పసిగట్టడం, హత్యలు, దొంగతనాలు జరిగిన సందర్భాలలో నిందితులను గుర్తించడం కోసం మంగళగిరి



ప్రత్యేకంగా 8 నెలల శిక్షణ కూడా పొందాయి. జిల్లా ఎస్పీ శ్రీ పి.జగదీష్ ఆదేశాల మేరకు ఏ.ఆర్ అదనపు ఎస్పీ, డీఎస్పీల పర్యవేక్షణలో ఆర్ ఎస్ ఐ జాఫర్ ఆధ్వర్యంలో డాగ్ హ్యాండ్లర్స్ సూర్యనారాయణ, మనోహర్, భీమ్లానాయక్, చాంద్ బాషాలు జాగిలాల విన్యాసాలకు మంచి తర్ఫీదునిచ్చారు.

## ప్రజా పాలన పథకాల ప్రారంబోత్సవాల్లో పాల్గొన్న కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి




హనుమకొండ : హనుమకొండ జిల్లా పెంబర్తి గ్రామ ప్రజా పాలన పథకముల ప్రారంబోత్సవంలో హసన్ పర్తి మండలం పెంబర్తి గ్రామ పంచాయతిలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకములను రెవెన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మదాయ శాఖల మంత్రి శ్రీమతి కొండా సురేఖా పాల్గొని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి , ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి , ఎంపీ కడియం కావ్య అధికారికంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో హనుమకొండ కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నరసింహరెడ్డి, హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సంగెం మండలం షాపూర్ గ్రామంలో ఎల్కతుర్తి మండలం నారాయణపూర్ గ్రామంలో ప్రజా ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న నాలుగు సంక్షేమ పథకాలలో అర్హులైన లబ్ధిదారులకు పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం , ఆరోగ్యశ్రీ 10 లక్షల పెంపు , గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు కరెంటు బిల్లు మాఫీ, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేశామని అదేవిధంగా రెండవ సంవత్సరం ప్రారంభంలోనే మరో నాలుగు నూతన సంక్షేమ పథకాల అమలుకు కార్యచరణ చేపట్టమని అన్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా మార్గదర్శకాల ప్రకారం వ్యవసాయ భూమి లేని కుటుంబాలను గుర్తించామని వీరికి సంవత్సరానికి 12 వేల రూపాయలను రెండు విడుతలలో వారి బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందని, దీనికి సంబంధించిన జాబితా గ్రామాలలో ప్రదర్శిస్తామని ఏదైనా అభ్యంతరాలు ఉన్నా, ఇంకా ఎవరైన అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవచ్చని వాటిని కూడా పరిశీలించి అమలు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు, ఎంపీడీవో, ఎమ్మార్వోలు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మరో ఉదయం

## సంపాదకీయం

# దావోస్‌లో ఏపీ బ్రాండ్ ధగ ధగ!

రాష్ట్రం అపారమైన అవకాశాలకు గని అని, సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, విమాన సదుపాయాలు, పోర్టులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని దావోస్ సదస్సులో చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో ఇటీవల తీసుకొచ్చిన పది పాలసీలను ఆయన తెలియజేసారు. ప్రపంచ దేశాలకు చెందిన వ్యాపార దిగ్గజాలు, వివిధ దేశాల అధినేతలు పాల్గొనే దావోస్ ఆర్థిక సదస్సు పెట్టుబడులు ఆకర్షించేందుకు అద్భుతమైన అవకాశమున్న చోటు. ఇది ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేసే అద్భుతమైన వేదిక కూడా. మేధావులు, సామాజిక కార్యకర్తలు, ఆర్థిక నిపుణులు, పాత్రికేయులు పాల్గొనే అతి కీలకమైన సమావేశం అది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం రాష్ట్రంలో పెట్టుబడులు సాధనే లక్ష్యంగా దావోస్‌లో వివిధ వ్యాపార దిగ్గజాలతో వరుస భేటీలయ్యారు ముఖ్యమంత్రి చంద్రబాబు. రాష్ట్రానికి వీలైనన్ని పరిశ్రమలు తీసుకురావడమే లక్ష్యంగా, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను ప్రపంచానికి ప్రమోట్ చేసి రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అపార అవకాశాలను వివరించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించి పారిశ్రామికీకరణను కొత్త పుంతలు తొక్కించేందుకు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక, వ్యాపార దిగ్గజాలను ఒప్పించి రాష్ట్రానికి రప్పించడానికి భగీరథ ప్రయత్నం చేశారు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేష్. రాష్ట్రం పెట్టుబడులకు అత్యంత అనుకూల ప్రదేశమని ప్రపంచ దేశాలకు చాటి చెప్పేందుకు ప్రతిష్ఠాత్మకమైన ప్రపంచ ఆర్థిక ఫోరాన్ని చంద్రబాబు వేదికగా చేసుకున్నారు. ఏపీ అపారమైన అవకాశాల గని అని, వ్యవసాయ ఉత్పత్తులు, 1,053 కిలోమీటర్ల సుదూర తీరప్రాంతం, విశాలమైన రోడ్లు, విమాన సదుపాయాలు, పోర్టులు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు పుష్కలంగా ఉన్నాయని, దేశంలో మరెక్కడా లేని విధంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందజేస్తున్నామని తెలియజేశారు. రాష్ట్రంలో యూనిట్లు ఏర్పాటు చేసే సంస్థలకు 15 రోజుల్లో అన్ని అనుమతులు మంజూరు చేసేందుకు ఏపీ ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డు ప్రత్యేక వ్యవస్థను సిద్ధం చేస్తామని పెట్టుబడిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కోసం ఇటీవల తీసుకొచ్చిన పది పాలసీలను దావోస్ వేదికగా ఆయన తెలియజేసారు. 74 ఏళ్ల వయస్సులో దావోస్‌లో గడ్డ కట్టే చలిలోనూ పర్యటించి దేశాధినేతలతోను, బిల్‌గేట్స్ నుంచి టాటా గ్రూపు చంద్రశేఖరన్, తదితర వ్యాపార దిగ్గజాలతో సమావేశమవుతూ ఐటీ నుంచి ఏఐ వరకు, విస్తృతంగా పెట్టుబడుల వేట సాగించారు చంద్రబాబు. మాజీ సీఎం జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో దావోస్ సదస్సులో ఆంధ్రప్రదేశ్ అడ్రస్ గల్లంతు అయి రాష్ట్రం నుంచి దావోస్‌లో ప్రాతినిధ్యమే లేకుండా పోయింది. రాష్ట్రానికి పెట్టుబడులు ఆకర్షించడం మాట దేవుడెరుగు. ఉన్న కంపెనీలను వెళ్లగొట్టడమే పనిగా జగన్ ప్రభుత్వం అనుసరించిన నిరంకుశ విధానాలు, కొత్త పెట్టుబడులకు ఉన్న అవకాశాలను దూరం చేశాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన మొదటి దావోస్ సదస్సులో మళ్లీ ఏపీ బ్రాండ్ ధగ ధగ లాడింది. రాష్ట్రానికి పెట్టుబడులను, కంపెనీలను ఆకర్షించే లక్ష్యంతో దావోస్ పెవిలియన్లలో వరస సమావేశాలతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ విరామం లేకుండా గడిపారు. గ్రీన్, క్లీన్ ఎనర్జీకి ఏపీ గమ్యస్థానంగా మారిన తీరును దిగ్గజ కంపెనీలకు చెప్పి, సానుకూల స్పందనను రాబట్టారు. హైడ్రోజన్ హబ్, డేటా సెంటర్లు, గూగుల్ క్లౌడ్ విస్తరణ, వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు పరిశ్రమ హోదా, ఇలా రాష్ట్రాభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్న విధానాన్ని దావోస్ వేదికపై ప్రపంచ ప్రతినిధులకు పరిచయం చేశారు. స్విస్‌మెన్, ఓర్లికాన్, ఆంగ్స్ ఫిస్టర్, స్విస్ టెక్స్‌టైల్స్ యాజమాన్యాలతో చంద్రబాబు బృందం వరుస సమావేశాలు నిర్వహించింది. రాష్ట్రంలో రీసెర్చి సెంటర్ ఏర్పాటుకు స్విస్‌మెన్ సంస్థ ముందుకొచ్చింది. ఇన్నోవేషన్ హబ్‌లు, ఇంక్యుబేటర్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చింది. అడ్వాన్స్‌డ్ కోటింగ్ సొల్యూషన్ సెంటర్ ఏర్పాటుకు ఓర్లికాన్ మొగ్గుచూపింది. ఏఐ సెంటర్ల ఏర్పాటుపైనా ఆసక్తిని చూపింది. అడ్వాన్స్‌డ్ సీలింగ్ సొల్యూషన్ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని ఆంగ్స్ ఫిస్టర్ సంస్థను చంద్రబాబు కోరగా, ఆ సంస్థ సానుకూలత వ్యక్తం చేసింది. రీసెర్చి టెక్స్‌టైల్ యూనిట్ ఏర్పాటుకు స్విస్ టెక్స్‌టైల్స్ కంపెనీ ముందుకొచ్చింది. ప్రపంచంలోనే అదిపెద్ద సముద్రయాన రంగ సంస్థ మార్స్క్... ఏపీలోని సముద్రతీరం పట్ల ఆసక్తి చూపి త్వరలోనే పర్యటనకు వస్తామని హామీ ఇచ్చింది. విశాఖ, తిరుపతిలో కార్యకలాపాలను ప్రారంభించాలన్న చంద్రబాబు ఆహ్వానానికి సిస్కో సానుకూలంగా స్పందించింది. తిరుపతి, విశాఖలో సెమికండక్టర్ యూనిట్లను స్థాపించే విషయమై త్వరలో నిర్ణయం తెలుపుతామని దక్షిణ కొరియాకు చెందిన ఎల్జీ కెమ్ సంస్థ సీఈవో పిన్‌హక్ చియోబ్ తెలిపారు. కార్ల్స్‌బెర్గ్ గ్రూప్ రాష్ట్రంలో పండ్ల రసాలు, శీతల పానీయాలు, బీర్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ ఉత్పత్తి ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు సానుకూలత ప్రదర్శించింది. విశాఖ, అమరావతిలో గూగుల్ డిజైన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని చంద్రబాబు కోరగా, గూగుల్ క్లౌడ్ సీఈవో కురియన్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్రాన్ని పెట్రోలియం హబ్‌గా మార్చే దిశలో భాగస్వాములమవుతామని పెట్రోనాస్ సంస్థ తెలిపింది. రాష్ట్రంలో పెప్సికో ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ఛైర్మన్ స్టీవెన్ కెహూ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఆరోగ్య, విద్యారంగాల్లో కొత్త ఆవిష్కరణలకు ఏపీని కేంద్రంగా మార్చే అంశాన్ని మిలిండా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్‌ను కలిసి చంద్రబాబు చర్చించారు. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఫర్ హెల్త్ ఇన్నోవేషన్ డయాగ్నోస్టిక్స్‌ను

# టీడీపీ సభ్యత్వాల్లో పాలకొల్లు టాప్

**రికార్డు స్థాయిలో నమోదు**

**జిల్లాలో 30శాతం మంది తెలుగుదేశం సభ్యులే**

**పాలకొల్లు, ఉండిలో రికార్డులు బ్రేక్**




భీమవరం : తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు రికార్డు స్థాయిలో జరిగింది. జిల్లాలో ఉన్న ఓటర్లలో నాలుగో వంతుమంది తెలుగుదేశం సభ్యులుగా చేరారు. జిల్లా పరి?ధిలోని ఏడు నియోజకవర్గాల్లో పాలకొల్లు ప్రథమ స్థానంలో నిలచింది. రాష్ట్ర స్థాయి రికార్డులను బ్రేక్ చేసేలా సభ్యత్వాలు నమోదయ్యాయి. ఆ తర్వాత స్థానంలో ఉండి నియోకవర్గం నిలిచింది. ఓటర్లలో దాదాపు మూడో వంతు మంది వంతుమంది తెలుగుదేశం సభ్యత్వం తీసుకున్నారు. నమోదు కార్యక్రమాన్ని పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. గతంలో మాదిరిగా కేవలం రశీదులు ఇచ్చే సంప్రదాయానికి స్వస్తి చెప్పింది. సభ్యత్వం తీసుకున్న వారు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంది. దాంతో ఇష్టం ఉన్న వారే తెలుగుదేశం సభ్యత్వం తీసుకునే విధంగా పార్టీ ఆదేశాలు జారీచేసింది. నియోజకవర్గ బాధ్యులు అధిష్ఠానం ఆదేశాలకు కట్టుబడి పనిచేశారు. ప్రణాళికాబద్ధంగా సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి మంది సభ్యత్వాన్ని తీసుకుంటే ఒక్క పశ్చిమగోదావరి జిల్లాలోనే దాదాపు 4.90 లక్షల మంది తెలుగుదేశం ప్రాథమిక సభ్యత్వంలో చేరారు. తెలుగుదేశం పార్టీ బీమా సౌకర్యం కూడా కల్పించింది. అన్ని వర్గాలనుంచి స్పందన లభించింది. కేడర్ కూడా పట్టుదలతో సభ్యత్వనమోదుకు కృషి చేసింది. ప్రభుత్వం ఏర్పడినా సరే సరైన ప్రాతినిధ్యం లేకుండా పోయిందంటూ జిల్లాలోని కొన్ని నియోకవర్గాల్లో తెలుగుదేశం శ్రేణులు ఆందోళనతో ఉన్నాయి. ముఖ్యంగా తాడేపల్లిగూడెం, భీమవరం, నర్సాపురంలో ఈ సారి నాయకత్వంలోనూ, కేడర్‌లోనూ కాస్త అసంతృప్తి ఉంది. మూడు నియోకవర్గాల్లో కూటమిలో భాగంగా జనసేనకు కేటాయించారు. అయితే నామినేటె డ్ పదవుల విషయంలోనూ ప్రధాన్యం లభించలేదు. అయినా సరే సభ్యత్వ నమోదులో నియోజకవర్గ బాధ్యులు తమ వంతు కృషి చేశారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను చేపట్టారు. ఎప్పటికప్పుడు అధిష్ఠానం కూడా నియోజకవర్గాల వారీగా అప్రమత్తం చేసింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని దిశానిర్దేశం చేసింది.

**మూడవ వంతు సభ్యత్వం**

జిల్లాలో 14,70,852 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 4,90,182 మంది సభ్యత్వాన్ని తీసుకున్నారు. అంటే దాదాపు 33శాతం మంది ఓటర్లు తెలుగుదేశం సభ్యత్వాన్ని తీసుకున్నారు. పార్టీ చరిత్రలో ఇంతలా సభ్యత్వ నమోదు కావడంపై పార్టీ శ్రేణుల్లోనూ జోష్ నెలకొంది. పార్టీకి బలమైన నాయకత్వం, కేడర్ ఉండడంతో ఇది సాధ్యపడింది.

**రికార్డుల బ్రేక్..**

పాలకొల్లు నియోజకవర్గంలో ఈసారి సభ్యత్వ నమోదుకు పోటీ పడ్డారు. ఇక్కడ 1,94,913మంది ఓటర్లున్నారు. దాదాపు 75 శాతం మంది ఓటర్లు సభ్యత్వాన్ని తీసుకున్నారు. అంటే 1,49,458 మంది ఓటర్లు పాలకొల్లు నియోజకవర్గంలో సభ్య త్వం పొందారు. రాష్ట్ర స్థాయిలోనే పాలకొల్లు నియోజకవర్గం రికార్డులు బ్రేక్ చేసింది. మంత్రి నిమ్మల రామానాయుడు ప్రణాళిక అక్కడ బాగా పనిచేసింది. ఆ తర్వాత ఉండి నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వాలు తీసుకున్నారు. ఉండిలో 1,21,552మంది సభ్యత్వం పొందారు. అక్కడ 60 శాతం మంది ఓటర్లు తెలుగుదేశం సభ్యత్వం తీసుకున్న వారిలో ఉన్నారు. రెండు నియోజకవర్గాలు ఈసారి గట్టి పోటీ పడ్డాయి. తెలుగుదేశం పార్టీకి ప్రాతినిధ్యం లేని భీమ వరం, తాడేపల్లిగూడెం, నర్సాపురం నియోకజవర్గాల్లోనూ మునుపెన్నడూ లేని విధంగా సభ్యత్వాలు నమోదు చేశారు. తణుకు, ఆచంట నియోకవర్గంలో ఈ సారి పక్కా ప్రణా ళికతో ముందుకు వెళ్లారు. మొత్తంపైన అధిష్ఠానం ఆకాం క్షలకు అనుగుణంగా జిల్లాలో సభ్యత్వాలు నమోదు కావడ ంతో నాయకత్వం , కేడర్ మంచి జోష్ మీద ఉంది.

# న్యూఢిల్లీలో ఘనంగా గణతంత్ర దినోత్సవ వేడుకలు..



హైదరాబాద్, జనవరి 26: కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరు కారణంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు జీర్ణం కావడం లేదని.. ఈ నేపథ్యంలో ఆయనకు ఈనో ప్యాకెట్లు పంపిస్తానని తెలంగాణ రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక విధ్వంసం జరిగిన అనంతరం రాష్ట్రంలో సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. అసహనానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ పరాకాష్టగా మారారన్నారు. పథకాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుంటే.. అవి ఎందుకు అని ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రశ్నించారని గుర్తు చేశారు. ఏ ఊరికి పోదామో నువ్వే డిసైడ్ చేయి.. ఒక్క లబ్దిదారుడికి అన్యాయం జరిగినా అడగాలంటూ కేటీఆర్‌కు మంత్రి పొన్నం సవాల్ విసిరారు. ఇక రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ చిత్రాలు ఉండాలంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలు చేయడంపై మంత్రి పొన్నం ఆగ్రహం వ్యక్తం చేశారు. బండి సంజయ్ ఇంట్లో నుంచి డబ్బులు ఇవ్వడం లేదని ఆయన వ్యంగ్యంగా అన్నారు. ఇందిరమ్మ పేరు పెడితే నగదు ఇవ్వారా? ఎలా ఇవ్వరో మేము చూస్తామన్నారు.

**కేంద్ర మంత్రి బండికి వార్నింగ్..**

మాజీ ప్రధాని ఇందిరా గాంధీ గురించి అవహేళగా మాట్లాడితే.. ఊరుకునేది లేదంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు వార్నింగ్ ఇచ్చారు. ఇందిరాగాంధీని గతంలో మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్.. అపర కాళీకా మాతతో పోల్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గత 10 నెలల కాలంలో.. జీఎస్టీ రూపంలో రూ. 37 వేల కోట్లు కేంద్రం వసూల్ చేసిందని.. మరి అందులో తెలంగాణకు కేంద్రం ఎంత ఇచ్చిందంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు.

**ఎవరు ఎన్ని కుట్రలు చేసినా..**

**వీళ్లేమైనా దేశం కోసం ..**

దీన్ దయాళ్ అంత్యోదయ, దీన్ దయాళ్ గృహ జ్యోతి వంటి పేర్లు.. ప్రభుత్వ పథకాలకు ఎందుకు పెట్టారని బీజేపీ నేతలను సూటిగా మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. వీళ్లేమైనా దేశం కోసం ప్రాణ త్యాగం చేశారా? అని సందేహం వ్యక్తం చేశారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారని.. ఒక్క రూపాయి అయినా.. కేంద్రం నుంచి అదనంగా తీసుకు వచ్చారా? అని కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు పొన్నం ప్రభాకర్ చురకలంటించారు. భారత మాజీ ప్రధాని ఇందిరా గాంధీని ఇంకొక్క మాటన్న భారతీయులు ఊరుకోరని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**పద్మ పురస్కారంపై స్పందించిన బాలయ్య బాబు**

**ఇంతకీ కేంద్ర మంత్రి ఏమన్నారంటే..?**

కరీంనగర్ నగర మేయర్ సంతోష్ రావుతోపాటు పలువురు కార్పొరేటర్లు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం కేంద్ర మంత్రి బండి సంజయ్ సమక్షంలో వారంతా బీజేపీ కండువా కప్పుకొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ.. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇచ్చే ఇళ్లకు ఇందిరమ్మ పేరు పెడితే ఒక్క ఇల్లు కూడా ఇవ్వబోమని ఆయన స్పష్టం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తుందని.. ఈ నేపథ్యంలో రేషన్‌కార్డులపై ప్రధాని మోదీ ఫొటో ఎందుకు పెట్టడం లేదంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. జనవరి 26వ తేదీన నుంచి ప్రభుత్వం మంజూరు చేసే కొత్త రేషన్ కార్డులపై సీఎంతోపాటు ప్రధాని మోదీ ఫొటో కూడా పెట్టాల్సిందేనని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పైవిధంగా స్పందించారు.

# డ్రోన్ కనిపెట్టేస్తుంది!

**మరిన్ని అమర్చే దిశగా అడుగులు**

**తాజాగా డ్రోన్ కెమెరాలతోనూ పర్యవేక్షణ**

**నేరాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు**

- డిసెంబరు 31 రాత్రి నగరంలోని ప్రధాన జంక్షన్‌లో ఇద్దరు ద్విచక్రవాహనదారుల మధ్య వాగ్వాదం జరిగింది. అది చూసి నిమిషంలో పది మంది జనం గుమిగూడారు. మరో నిమిషంలో పోలీస్ జీపు వచ్చింది. దీంతో వెంటనే అందరూ చెల్లాచెదురైపోయారు. డ్రోన్ కెమెరా పర్యవేక్షణతోనే నిమిషాల వ్యవధిలో పోలీసులు అక్కడకు చేరుకోగలిగారు. - విజయనగరంలోని ఏటీఎం వద్ద ఇటీవల కాపుకాసిన దొంగ అమాయకంగా నటించి అక్కడకు వచ్చిన ఓ



వృద్ధుడిని ఆప్యాయంగా పలకరించి అతని ఏటీఎం నుంచి డబ్బులు విత్‌డ్రా చేసి ఇచ్చాడు. ఆపై అతనికి తెలియకుండా ఏటీఎంను మార్చేసి వేరొక ఏటీఎం మిషన్ వద్దకు వెళ్లి ఖాతా ఖాళీ చేసేశాడు. ఏటీఎం సీసీ కెమెరాతో పాటు దొంగ వెళ్లిన దారిలో ఉన్న సీసీ కెమెరాల్లో కూడా దొంగ సంచరించిన దృశ్యాలు రికార్డు అయ్యాయి. దీంతో సులువుగా దొరికిపోయాడు.

విజయనగరం, జిల్లా వ్యాప్తంగా పట్టణాలు, నగరంపై నిఘా పెరిగింది. ఇదివరకటిలా దొంగతనం చేసి పరారీ అయిపోవచ్చునని తలిచే వ్యక్తులకు పోలీస్ శాఖ మూడో కన్నుతో జవాబిస్తోంది. ఒక్కోసారి గంటల వ్యవధితో చోరులను పట్టేస్తోంది. ఎక్కడికక్కడే సీసీ కెమెరాలు అమర్చడంతో పాటు డ్రోన్ కెమెరాలతో నిరంతరం అన్ని ప్రాంతాలను జల్లెడ పడుతోంది. దీంతో దొంగలు, దోపిడీదారులు, అక్రమ కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులెవరైనా వేగంగా పట్టుకుని కటకటాల వెనుక బంధిస్తోంది. విజయనగరం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా మార్పు చెందాక ఏడాదికేడాది అతి త్వరగా విస్తరిస్తోంది. జనావాసాలు పెరుగుతున్నాయి. వాణిజ్య వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతోంది. జిల్లాలోని ఇతర పట్టణాలూ పెరుగుతున్నాయి. అదే సమయంలో దొంగతనాలు పెరిగాయి. ప్రస్తుతం విజయనగరానికి సంబంధించి మూడు డ్రోన్లు అందుబాటులోకి వచ్చాయి. మిగతా స్టేషన్లకు సైతం పోలీస్ శాఖ డ్రోన్లను విస్తరించే పనిలో ఉంది. జిల్లా వ్యాప్తంగా అన్ని సర్కిళ్లతో పాటు నేరాలు అధికంగా నమోదయ్యే ప్రాంతాలను డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షించాలని పోలీసులు భావిస్తున్నారు. ఇటీవల అనంతపురం జిల్లా పోలీస్ శాఖ ప్రయోగాత్మకంగా చేపట్టిన డ్రోన్ ఆపరేషన్ సక్సెస్ అయ్యింది. ఆ జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తించింది ఇటు ఉమ్మడి విశాఖ జిల్లాలో గంజాయి నియంత్రణకు సైతం పోలీస్ శాఖ డ్రోన్ల సాయం తీసుకుంది. ఈ నేపథ్యంలోనే మన జిల్లాలో కూడా డ్రోన్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని భావించింది. డిసెంబర్ 31తో పాటు సంక్రాంతి మూడు రోజులూ డ్రోన్ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించింది. - గంజాయి రవాణాకు జిల్లా అడ్డాగా మారుతోంది. అదే సమయంలో నాటుసారా విక్రయాలూ జరుగుతున్నాయి. పేకాట శిబిరాలు కొనసాగుతున్నాయి. కోళ్ల పందేలు గుట్టుగా జరుగుతున్నాయి. చోరీలు, దోపిడీలు ఆగడం లేదు. వీటన్నింటినీ నివారించడం పోలీస్ శాఖకు ఏళ్లుగా సవాల్‌గా మారింది. అందుకే డ్రోన్ల సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని భావిస్తోంది. జిల్లాలో డ్రోన్లు ఎగురవేసే బాధ్యతను సైబర్ క్రైం విభాగం చూస్తోంది. కొద్దిరోజుల్లో పోలీస్ శాఖకు మరికొన్ని డ్రోన్లు అందుబాటులో రానున్నాయి. ప్రస్తుతానికైతే 3 అధికారికంగా, మరో 10 ప్రైవేటు వ్యక్తులకు సంబంధించి డ్రోన్ల సేవలను వినియోగించుకుంటున్నట్టు పోలీస్‌వర్గాలు చెబుతున్నాయి. - జిల్లా కేంద్రంలో 330 సీసీ కెమెరాలను పోలీస్‌శాఖ ఏర్పాటుచేసింది. మరో 130 వరకూ ప్రైవేటు సంస్థలు, వ్యాపార వర్గాలతో ఏర్పాటు చేయించారు. మరిన్ని సీసీ కెమెరాలను త్వరలో అమర్చనున్నారు.

**అన్ని స్టేషన్లకూ డ్రోన్ సేవలు**

పోలీస్ శాఖలో డ్రోన్ల వినియోగం పెరిగింది. జిల్లా వ్యాప్తంగా డ్రోన్లు అందుబాటులోకి వస్తాయి. ఇప్పటికే ప్రయోగాత్మకంగా డ్రోన్ల ప్రదర్శన చేపట్టాం. అన్ని పోలీస్‌స్టేషన్లకు ఈ సేవలను అనుసంధానిస్తాం. సైబర్ క్రైం విభాగం పర్యవేక్షణలో డ్రోన్ల వ్యవస్థ కొనసాగుతుంది. నేర నియంత్రణే వీటి లక్ష్యం.

## సోయా క్యాండిల్ ఎంత స్పెషల్ అంటే.. !




పుట్టిన రోజు, పండుగలు, ప్రత్యేక ఫంక్షన్లు ఇలా సందర్భంతో సంబంధం లేకుండా క్యాండిల్ వెలిగించడం పరిపాటి. చాలా వరకూ కరెంట్ పోయినప్పుడు కూడా కొవ్వొత్తి వెలిగిస్తాం. కానీ ప్రత్యేకంగా వెలిగించే క్యాండిల్స్ విషయానికి వస్తే వీటిలో బోలెడు రకాలున్నాయి. సోయా క్యాండిల్స్, సెంట్ సువాసనలతో రూమ్ అందాన్నే కాదు, ఆహ్లాదకరమైన సువాసనతో మనసును తేలికచేసేస్తాయి. ఖరీదులో కూడా మన క్యాండిల్స్‌కి కాస్త దగ్గరలోనే ఉంటాయి. ఈ చిన్న జార్స్ క్యాండిల్స్ చూసేందుకు ముచ్చటగా, ముద్దుగా ఉంటాయి. వీటి గురించి మరింత తెలుసుకుందాం. సోయా మైనం అనేది సోయాబీన్ మొక్కల నుంచి సేకరించిన స్వచ్ఛమైన సహజమైన మైనం. ఇది మానవ శరీరానికి హాని కలిగించని విధంగా ఉంటుంది. ధర కూడా తక్కువ, రంగు కూడా మారదు. ఈ కొవ్వొత్తుల సవాసనలు అరోమా థెరపీ, రిలాక్సేషన్, ఒత్తిడిని తగ్గించడం, ధ్యానం, మూడ్ పీస్ కోసం సరిగ్గా సరిపోతాయి. ఇది దోమలు, యాంటీ బాక్టీరియల్ , పురుగులను తిప్పి కొడుతుంది. చిరాకు నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. ఒత్తిడి, నిద్రలేమి, తలపోటు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. మనసిక స్థితిని మెరుగుపరుస్తుంది. దీనితో ఎలాంటి శ్వాసకోశ, నాసికా అలెర్జీలు, ఆస్తమా ఇతర సమస్యలు రావు. ఈ కొవ్వొత్తి వెలిగించినప్పుడు పొగ రాదు.

### వర్షాకాలంలో ఈ పండ్లు తింటే ఎన్ని లాభాలో..

సోయా కొవ్వొత్తులు మామూలుగా మనం వాడే కొవ్వొత్తులకు వీటికీ మధ్య ఏం తేడా ఉంటుంది అన్నీ ఒకటే కదా అనుకోవచ్చు. ఈ కొవ్వొత్తులు మసిని ఇవ్వవు. జంతు ఉత్పత్తులతో తయారు చేసిన కొవ్వొత్తుల కంటే సోయా కొవ్వొత్తులు ఎక్కువసేపు ఉంటాయి. ఇవి అందం విషయంలో పారాఫిన్ కొవ్వొత్తుల కంటే అందంగా ఉంటాయి. వీటిని అందమైన ఆకారాల్లో బహుమతుల్లా తయారుచేస్తారు. గిఫ్ట్ ఐటమ్స్ కింద కూడా ఇచ్చుకోవచ్చు. సోయా కొవ్వొత్తిని స్టైల్‌కు తగినట్టుగా మార్చుకోవచ్చు.

### క్యాన్సర్, గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గించే రెడ్ ముల్లంగి

ఎలా తయారు చేస్తారంటే.

గాజు గిన్నెలో సోయా మైనం వేసి వేడి నీటిలో ఈ మైనాన్ని ఉంచాలి. డైరెక్ట్‌గా మంట మీద ఉంచకూడదు. అప్పుడప్పుడూ కదిలిస్తూ ఉండాలి. మైనాన్ని చిన్న గాజు కూజాలలో వేయాలి. ఈ కరిగిన మైనానికి కొద్దిగా సువాసనకోసం ఫ్లేవర్స్ కలిపితే క్యాండిల్ వెలుగుతున్నంత సేపూ మంచి వాసన చుట్టూ అల్లుకుంటుంది. కంటైనర్ మధ్యలో చిన్న మైనం ఒత్తిని ఉంచాలి. మైనపు గట్టిపడే వరకు ఉంచాలి. కంటైనర్ కదిలించకుండా అలాగే ఉంచాలి. మరిసటి రోడు ఒత్తిని కొద్దిగా కత్తిరించాలి. ఈ క్యాండిల్స్ ఫంక్షన్స్, పెద్ద మాల్స్, ఏదైనా వేడుకల్లో ప్రత్యేకంగా కనిపిస్తాయి. గమనిక: పైన పేర్కొన్న వివరాలను ఆరోగ్య నిపుణులు అందించిన సమాచారం మేరకు ఇవ్వడం జరిగింది. దీనిని ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ధృవీకరించడం లేదు. ఆరోగ్య నిపుణుల సలహాల మేరకు పైన చెప్పిన సూచనలు పాటించాలి.

## పెట్టుబడుల గమ్యస్థానం తెలంగాణ

రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అనేక అంశాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు. దావోస్ కేంద్రంగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు 2025లో గత ఏడాదితో పోలిస్తే తెలంగాణకు నాలుగు రెట్లు అధికంగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ సంస్థలు ఆసక్తి చూపించాయంటే ఆ ప్రయత్నంలో ప్రభుత్వం భారీ విజయం సాధించినట్టే. నాయకత్వ కృషి ఎంతో ఉంటే తప్ప పెట్టుబడులు రావు. నమ్మకం కలగందే పెట్టుబడులకు సంస్థలు కూడా ముందుకు రావు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' అన్న నినాదంతో అనుసరిస్తున్న విధానాలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు దోహదపడ్డాయి. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం దావోస్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచి నిరంతరం శ్రమించింది. పరిమితమైన సమయంలో క్షణం తీరికలేకుండా ప్రపంచ దిగ్గజాలతో సంప్రదింపులు జరిపింది. ముఖ్యమంత్రి మాటల్లో చెప్పాలంటే 'తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించడం ద్వారా అధిక పెట్టుబడులను ఆకర్షించాం. గత ఏడాది మా ప్రభుత్వం రూపొందించిన అనుకూల విధానాలే దీనికి కారణం' అన్నారు. ఆయన ప్రయత్నాల ఫలితంగానే ఈ రోజు తెలంగాణ పేరు ప్రపంచ వేదికలపై వినిపిస్తోంది. ఏకంగా రూ.1,78,950 కోట్ల విలువ చేసే పెట్టుబడులు తెలంగాణకు రావడమంటే ఆషామాషీ కాదు. వీటితో దాదాపు 50 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది. దావోస్‌లో 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' అన్న అంశంపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహించిన సదస్సులోను, 'రీఇమేజింగ్ అర్బన్ మొబిలిటీ ట్రెండ్స్, ఇన్నోవేషన్స్ అండ్ ఆపర్చునిటీస్ 2030 అండ్ బియాండ్' అన్న అంశంపై భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), హెచ్‌ఎంసీ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులోను తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలు, లక్ష్యాలను ప్రపంచ దిగ్గజాల ముందు ముఖ్యమంత్రి స్పష్టంగా ఆవిష్కరించారు. కమ్యూనికేషన్ రంగంలో శరవేగంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకోవడంలో రాజీవ్‌గాంధీని, సరళీకృత ఆర్థిక విధానాలతో దేశానికి మార్గనిర్దేశకులైన పీవీ నరసింహారావును, అలాగే హైదరాబాద్‌లో ఐటీ రంగ విస్తరణకు చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలు, హైదరాబాద్ ఒక మహానగరంగా విస్తరించడానికి విస్తృతమైన మౌలిక సదుపాయాలు కల్పించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి నేతలు చూపిన బాటను కొనసాగిస్తామని, దేశాన్ని ఐదు ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి సంకల్పానికి తెలంగాణ వంతుగా నిలబడతామనీ దావోస్‌లో రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారు. మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే వేదికపైన మాట్లాడిన సందర్భంలో కూడా రేవంత్‌రెడ్డి తన వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీపడతామన్నారు. మూడు రాష్ట్రాల నుంచి గలగలా పారే కృష్ణా, గోదావరి నదులతో పోలుస్తూ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా మూడు రాష్ట్రాలూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన నాయకుడు రేవంత్‌రెడ్డి. ఆ మాటలు ప్రపంచ ఆర్థిక సదస్సు మోడరేటర్ సమీర్ శరణ్‌నే కాదు.. ఎంతో మంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను కూడా ఆకర్షించాయి. మూడు రోజుల దావోస్ పర్యటనలో రేవంత్‌రెడ్డి ఇదే ఒరవడిని కొనసాగించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన స్పీడ్ ఒక అసెట్. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం గత ఏడాది కాలంలో దూరదృష్టితో అమలు చేస్తున్న ప్రణాళికలు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగిస్తున్నాయి. కొత్తగా డేటా సెంటర్ల ఏర్పాటు లేదా విస్తరణకు ఆయా సంస్థలు చొరవ చూపడానికి అదీ ఒక కారణమే. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అందరికన్నా ముందుగా అందిపుచ్చుకుని హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి సదస్సును నిర్వహించడమే కాకుండా, ప్రత్యేకంగా ఏఐ సిటీ నిర్మించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆ రంగంలో విస్తరించాలన్న సంస్థల్లో విశ్వాసాన్ని పెంచింది. హైదరాబాద్ కేంద్ర బిందువుగా డేటా సెంటర్లను నెలకొల్పడానికి ఐటీ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయంటే, అందుకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా నిలుస్తున్న తీరు ఆయా సంస్థలకు నమ్మకం కలిగిస్తున్నది. ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను అందిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పెరగడం, కాలుష్య కారక వాహనాలను తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎంతగా కట్టుబడి ఉందో అర్థమవుతుంది. మూసీ ప్రక్షాళన కూడా హైదరాబాద్ నగర భవిష్యత్తుకు ఒక బృహత్తరమైన ప్రణాళిక. కొందరు కావాలని కూల్చివేతలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేసినప్పటికీ మరో వంద సంవత్సరాల పాటు హైదరాబాద్ కాలుష్య రహిత, పర్యావరణ హితమైన నగరంగా విలసిల్లాలని చేపట్టిందే మూసీ పునరుజ్జీవం. కాలుష్య కాసారంగా మారిన మూసీని ప్రక్షాళన చేసి, ఈ మహానగర నీటి అవసరాలను తీర్చడమే కాకుండా, నల్గొండ ప్రజల సాగునీరు వంటి అనేక విషయాలతో ముడిపడిన అంశాలను దావోస్ వేదికగా ముఖ్యమంత్రి వివరించారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అన్ని విషయాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు. ప్రపంచ వేదికల్లో తెలంగాణ ఇమేజ్‌ని పెంచాలన్న ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పెట్టుబడులను కొందరు హేళన చేస్తున్నారు. అయితే, రాష్ట్రానికి మంచి చేస్తున్నారా లేక రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్నారా అన్నది ప్రజలు గమనిస్తూ ఉంటారు. హైదరాబాద్‌లో ఉన్న కంపెనీతో దావోస్‌లో ఒప్పందమేంటని కొందరు వ్యంగ్య ధోరణులు ప్రదర్శిస్తున్నారు. వారి హయాంలోనూ అదే జరిగినా, మరిచిపోయి నిస్సిగ్గుగా తెరమీదకు వస్తుంటారు. నిజానికి హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీ తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్‌లలోనూ విస్తరణకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసింది. ఆయా ప్రభుత్వాల నుంచి లభించే ప్రోత్సాహకాలు,




అవకాశాలు, అపాయింట్‌మెంట్స్... ఒకటేమిటి అనేకానేక అంశాలు ఇందులో ఇమిడి ఉంటాయి. వీటన్నింటికీ దావోస్ ఒక వేదికగా నిలుస్తుంది. తమిళనాడులో ఆ రాష్ట్రానికి సంబంధించిన ఏదైనా ఒక సమస్య తెరమీదకొస్తే ఆ రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ ఒకే వేదికపైకి వస్తాయి. తెలంగాణలోనూ ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి, పునర్నిర్మాణంలో కలిసి రావాలని, అనుభవంతో కూడిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రతిసారీ అంటుంటారు. ప్రపంచ పటంలో తెలంగాణ, హైదరాబాద్‌లు ఉండాలని అందరూ ఆకాంక్షించాలి. పెట్టుబడులు వస్తున్నాయంటే హర్షించాలి. 'మా పోటీ... ప్రపంచంతో' ఈ మాట అనాలంటే ఎంతో దూరదృష్టి, ధైర్యం కావాలి. మార్గనిర్దేశం చేసే శక్తి, సామర్థ్యాలు ఉండాలి. తెలంగాణ అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించడానికి జరుగుతున్న ప్రయత్నాలను మనస్ఫూర్తిగా స్వాగతిద్దాం. పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తున్నందుకు

# వామ్మో.. చలి!

-10 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రతలు

-నాలుగు రోజులుగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు

-ఉదయం, సాయంత్రం వేళల్లో అధికమవుతున్న తీవ్రత

-ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే జంకుతున్న జనం

-వృద్ధులు, పిల్లలకు తప్పని ఇబ్బందులు

మంచిర్యాల, : జిల్లాలో నాలుగు రోజులుగా చలి విజృంభిస్తోంది. క్రమేపీ ఉష్ణోగ్రతలు తగ్గుతుండటంతో ప్రజలు చలిబారిన పడుతున్నారు. ఈ యేడు ఇప్పటి వరకు లేని విధంగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో మరింతగా చలి పెరుగుతుండటంతో ఇళ్లనుంచి బయటకు వెళ్లాలంటేనే ప్రజలు జంకుతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. పగటిపూట ఉష్ణోగ్రతల్లో కూడా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం 9గంటల వరకు కూడా చలి ప్రభావం ఉండటంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. సాయంత్రం 6గంటల నుంచే చలి ప్రభావం కనిపిస్తోంది. శీతల గాలుల కారణంగా పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తర ఈశాన్య దిశ నుంచి వీస్తున్న గాలుల కారణంగా చలి ప్రభావం అధికంగా ఉంటోంది.




### ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులు..

ఒకేసారి చలి తీవ్రత పెరగడంతో ముఖ్యంగా వివిధ రంగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉదయం, రాత్రి షిఫ్ట్‌లకు వెళ్లే సింగరేణి కార్మికులతోపాటు కూరగాయలు, పాలు విక్రయించి జీవనం సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే చిన్నారులపైనా చలి ప్రభావం అధికంగా ఉంటోంది. విపరీతమైన చలి కారణంగా సింగరేణిలో గైర్హాజరు శాతం క్రమంగా పెరుగుతోంది. పాలు, కూరగాయల వ్యాపారులు తెల్లవారుజామున ఐదు గంటలకే బయటకు వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఉదయం 10గంటల వరకు కూడా రోడ్లపైకి జనాలు వచ్చేందుకు సాహసించడం లేదు. కాగా విపరీతంగా పెరిగిన చలి కారణంగా వృద్ధులు, పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వృద్ధులు, పిల్లలను అవసరమైతే తప్ప...ఉదయం, సాయంత్రం వేళల్లో బయటకు వెళ్లకుండా చూడాలని పేర్కొంటున్నారు.

### పొగమంచుతో వాహన చోదకుల ఇబ్బందులు..

విపరీతమైన చలికి తోడు పొగమంచు కారణంగా వాహన చోదకులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. రోడ్లన్నీ మంచుతో కప్పబడి ఉండటంతో ఉదయం ఎనిమిది గంటలకు కూడా లైట్ల వెలుతురులో వాహనాలను నడపాల్సి వస్తోంది. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతుండటంతో ఆయా ఏరియాల్లో చలితీవ్రత అధికంగా ఉంటోంది. ఇళ్లలో ఫ్యాన్లు పూర్తిగా బంద్ చేసినప్పటికీ రాత్రి వేళల్లో అధికంగా కురుస్తున్న మంచు కారణంగా చలికి వణికి పోవాలసిన పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం ఎనిమిది గంటలు దాటితే తప్ప.. సూర్యుడు ఉదయించడం లేదు.

### జిల్లాలో 10.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు..

జిల్లాలో బుధవారం 10.2డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కోటపల్లి మండలం తపాల్‌పూర్‌లో అత్యల్పంగా 10.2డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదుకాగా, జైపూర్ మండలంలో 10.7 డిగ్రీలు, వేమనపల్లి మండలం నీల్వాయిలో 10.8డిగ్రీలు, జన్నారం మండలంలో 10.9డిగ్రీలు, కోటపల్లి మండలం దేవులవాడలో 11.0డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

## తెగుళ్లను తెలుసుకుంటుంది.. పరిష్కారాలు చూపుతుంది..

- చిత్రాలు పంపితే చీడపీడల గుర్తింపు

- కేంద్ర ప్రభుత్వ ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్‌యాప్‌తో అనేక లాభాలు




సాంకేతిక పరిజ్ఞానం కొత్త పుంతలు తొక్కుతోంది.. వ్యవసాయంలోనూ ప్రస్తుతం అనేక ఆధునిక పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ముఖ్యంగా సెల్‌ఫోన్ వచ్చాక ప్రతీది అరచేతిలోనే తెలిసిపోతోంది. పంటల రక్షణకు సస్యరక్షణ చర్యలు ఎలా చేపట్టాలో సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకునేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందుకు అనుగుణంగా స్మార్ట్ ఫోన్‌లో పంటల రక్షణ చర్యలపై ఎన్‌పీఎస్‌ఎస్ అనే ఆప్ విడుదల చేసింది. వాంకిడి, : పంటలను ఆశించే చీడపీడల నివారణకు సత్వర సలహాలు, సూచనలు పొందడానికి వీలుగా కేంద్రప్రభుత్వం ఓయాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. వ్యవసాయశాఖ పరిధిలోని డైరెక్టరేట్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్, క్వారంటైన్, స్టోరేజ్ కార్యాలయం, ఐసీఏఆర్ శాస్త్రవేత్తల సహకారంతో నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం(ఎన్‌పీఎస్‌ఎస్) పేరిట జాతీయ చీడపీడల నిఘావ్యవస్థ అనే మొబైల్‌యాప్‌ను సిద్ధం చేసింది. దీన్ని రైతుల దరికి చేర్చే బాధ్యతను కేంద్రీయ సమగ్ర సస్యరక్షణ కేంద్రానికి అప్పగించారు. జిల్లాలో కొంతమంది రైతులను ఎంపిక చేసి వారికి మొబైల్‌యాప్‌పై అవగాహన కల్పిస్తున్నారు.

- చిత్రాలు పంపితే చీడపీడల గుర్తింపు..

ఈ యాప్‌లో ప్రధానంగా మూడు విభాగాలు ఉన్నాయి. చీడపీడల గుర్తింపు విభాగం(పెస్ట్ ఐడెంటిఫికేషన్ మాడ్యుల్), చీడపీడల నిఘావిభాగం(పెస్ట్ సర్వైలెన్స్ మాడ్యుల్), సలహాల విభాగం (అడ్వైజరీ మాడ్యుల్) చీడపీడల గుర్తింపు విభాగంలో 61పంటలకు సోకే చీడపీడలు, తెగుళ్లను గుర్తించవచ్చు. రైతు నేరుగా మొబైల్ ద్వారా పురుగు లేదా తెగుళ్ల చిత్రాన్ని తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే పురుగు లేదా తెగులును గుర్తించి దాని లక్షణాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల సమాచారాన్ని అందజేస్తుంది. చీడపీడల నిఘా విభాగంలో ప్రస్తుతానికి వరి, పత్తి, సోయా, మిర్చి, మొక్కజొన్న, వంగ, దానిమ్మ, ఆపిల్, అరటి, ద్రాక్ష, మామిడి, కంది, చెరకు, టమాట, మినుము, గోధుమ పంటలలో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమాచారాన్ని సమోదు చేయవచ్చు. రాబోయే కాలంలో మిగిలిన పంటలను కూడా చేర్చే అవకాశామున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ విభాగంలో క్వాంటిటేటివ్, క్వాలిటేటివ్ అనే రెండు భాగాలున్నాయి. క్వాంటిటేటివ్ భాగంలో ఎంపికచేసిన రైతులకు యాప్ ఐడీ, పాస్‌వర్డ్‌ను అధికారులు అందజేస్తారు. వారు మాత్రమే ఈ భాగాన్ని ఉపయోగించవచ్చు. ఇక క్వాలిటేటివ్ భాగంలో ఐడీ, పాస్‌వర్డ్ అవసరం లేకుండానే ఉపయోగించే అవకాశం ఉంటుంది. ఇక మూడోది సలహాల విభాగంలో రైతుల ఎన్‌పీఎస్ వెబ్‌పోర్టల్ నుంచి నిపుణుల సలహాలను చూడవచ్చు.

- ప్రయోజనాలు ఇలా..

- ఈ యాప్‌వల్ల సకాలంలో చీడపీడలను గుర్తించి నివారణకు సత్వర సమాచారాన్ని పొందవచ్చు. రైతులకు ఖర్చులు తగ్గి దిగుబడులు పెరిగి తద్వారా లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుంది. - పురుగుల వ్యాప్తిని త్వరగా కనిపెట్టి నిరోధించ వచ్చు. - ఒక ప్రాంతంలోని ముఖ్య పంటల్లో ఉన్న చీడపీడల చారిత్రక సమాచారం నమోదు ద్వారా రాబోయే రోజుల్లో పంటల సంరక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది. - చీడపీడలు, తెగుళ్ల సమాచారం అందుబాటులో ఉంచడం ద్వారా విధానకర్తలు వ్యవసాయరంగానికి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. రైతులు సద్వినియోగం చేసుకోవాలి.. మిలింద్ కుమార్, ఏడీఏ, వాంకిడి చీడపీడల నివారణకు, సత్వర సలహాలు, సూచనలు పొందడానికి వీలుగా కేంద్రప్రభుత్వం ఎన్‌పీఎస్‌ఎస్ మొబైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చించి. అనేకపంటలలో కీలకమైన పురుగులు, తెగుళ్ల ఉధృతి సమా చారం ఈ యాప్‌లో ఉంటుంది. రైతు నేరుగా మొబైల్ ద్వారా పురుగు లేదా తెగుళ్ల చిత్రాన్ని తీసి యాప్‌లో అప్లోడ్ చేస్తే వెంటనే గుర్తించి దాని లక్షణాలు, చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యల సమాచారాన్ని అందజేస్తుంది. రైతులు పండించే పంటల దిగుబడులు పెంచేందుకు అనుకూలమైన ఈ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

## ఇది త్యాగం కాదు... బాధ్యత



కల్నల్‌తో కాపురమంటే ఎడబాట్లు, త్యాగాలూ తప్పవు. నిరంతరం ప్రమాదాలతో చెలగాటాలూ తప్పవు. అయినా, ఆ వృత్తిని భర్తతో సమానంగా ప్రేమించడంతో పాటు, అటు కుటుంబానికీ, ఇటు నటనా జీవితానికీ సమ న్యాయం చేస్తున్నారు 'లక్కీ భాస్కర్' చిత్రంలో నటించిన గాయత్రి భార్గవి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆమె 'నవ్య'తో పంచుకున్న జీవితానుభావాలివి... మాది హైదరాబాదే! ప్రస్తుతం కుటుంబమంతా ఇక్కడే ఉంది. మాకు ఇద్దరు మగ పిల్లలు. పెద్ద బాబు అక్షజ్ భావిక్‌కు 18 ఏళ్లు. చిన్న బాబు కృతిక్ భావిక్‌కు ఎనిమిదేళ్లు. పెళ్లయ్యే నాటికి డిగ్రీ వరకే చదివినా, పెళ్లి తర్వాత చదువును కొనసాగించి ఎమ్‌ఎ, ఎమ్‌ఫిల్ చేయగలిగాను. అదే సమయంలో టీవిలో కూడా పని చేశాను. భోపాల్, అసోం, బెంగుళూరు... ఇలా విక్రమ్‌తో ఎక్కడకు వెళ్లినా ఆ ప్రాంతాల్లోని అనాథాశ్రమాలకు వెళ్లి పిల్లలకు ఉచితంగా చదువు చెప్పేదాన్ని. ఆయన కూడా తన తీరిక సమయాల్లో పిల్లలకు గణితం బోధించేవారు. లక్కీ భాస్కర్'తో నాకు మంచి గుర్తింపు వచ్చింది. హీరోయిన్ మీనాక్షిది కూడా సైనిక కుటుంబమే! దాంతో మేమిద్దరం వెంటనే కలిసిపోయాం. సినిమా చివరివరకూ నేనెంతో ఎంజాయ్ చేశాను. మా అబ్బాయి దుల్కర్ సల్మాన్ అభిమాని. దాంతో షూటింగ్ సమయంలో మా వారు బాబును వెంటబెట్టుకుని సెట్‌కు వచ్చారు. ఆయనకు మా ప్రొడక్షన్ భోజనం తినిపించాం. ఆ వాతావరణాన్ని ఆయన చాలా బాగా ఎంజాయ్ చేశారు. విక్రమ్ సుబ్రహ్మణ్యం... మావారు. ఆర్మీలో రెండో తరానికి చెందినవారు. మా మామయ్యగారు, ఆడపడుచు కూడా సైన్యంలో పని చేశారు. హిమనీనదాల దగ్గరకు వెళ్లిన తొలి బృందాల్లో మావారు కూడా ఉన్నారు. అప్పటివరకూ యుద్ధ సమయంలో తప్ప సైనికులెవరూ అక్కడకు వెళ్లేవారు కారు. పాకిస్తాన్, భారత్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో ఆరు నెలల గడపడం మొదలుపెట్టిన మొదటి బృందాలతో ఆయన కూడా వెళ్లారు. అప్పట్లో అక్కడ ఎలాంటి సదుపాయాలూ ఉండేవి కావు. ఉత్తరాలే ఏకైక కమ్యూనికేషన్. దాంతో మేమందరం ఆయనకు ఉత్తరాలు రాసేవాళ్లం. మేం రాసిన ఉత్తరం ఆయనకు చేరడానికి 15 రోజులు పడుతుంది. అయితే అప్పట్లో ఆయనకు నేనొక మంచి స్నేహితురాలిని మాత్రమే! చెన్నైలోని మా కజిన్ క్లాస్‌మేట్ ఆయన. అలా ఆయనతో పరిచయం ఏర్పడింది. ఓ సందర్భంలో ఆయన హైదరాబాద్ వచ్చారు. విక్రమ్‌కు హైదరాబాద్‌లో స్నేహితులు లేరు కాబట్టి కంపెనీ ఇవ్వమని మా కజిన్ అడగడంతో ఒకట్రెండు సార్లు కలిశాను. అలా మా స్నేహం మరింత పెరిగింది. అది ప్రేమగా మారిందనే విషయం, కలిసి 'బార్డర్' సినిమాకు వెళ్లినప్పుడు తెలిసింది. సినిమాలో సైనికుల కష్టాలు చూసి నేను కళ్లనీళ్లు పెట్టుకుంటూ ఉంటే, ఆయనేమో పెళ్లి ప్రస్తావన తీసుకొచ్చారు. కానీ అప్పటికి నేనింకా చిన్నదాన్ని. ఇంట్లో ఒప్పుకోరని అభ్యంతరం చెప్పాను. ఆ తర్వాత చాలా కాలం పాటు మా మధ్య ఉత్తరాలు, ఫోన్ కాల్స్ కొనసాగాయి. ఆ తర్వాత డిగ్రీ పూర్తి చేసేనాటికి ఆయన ఒక కోర్సు కోసం హైదరాబాద్ ఈఎమ్ఇ సెంటర్‌కి వచ్చి ఇక్కడే మూడేళ్లు ఉండిపోయారు. ఆ సమయంలో పెద్దల అంగీకారంతో మేమిద్దరం 2004లో పెళ్లితో ఒక్కటయ్యాం.

### ఆ కొరతలు తప్పవు

సైనికుడి భార్యగా ఆయనతో నాకున్న అనుబంధం ఎంతో ప్రత్యేకమైనదని చెప్పాలి. సగటు మహిళల్లాగే భర్తతో కలిసి కుటుంబ వేడుకలు, పండుగలు జరుపుకోవాలని నేనూ ఆశపడుతూ ఉంటాను. కానీ అలా అన్నిసార్లూ సాధ్యపడేది కాదు. టూర్లూ, షికార్లూ వీలుపడేవి కావు. పిల్లల పుట్టినరోజులు కూడా ఆయన లేకుండా జరుపుకోవలసి వస్తూ ఉండేది. అయితే పెళ్లికి ముందే సైనికుల జీవితాల పట్ల కొంత అవగాహన ఉండడంతో నేనెప్పుడూ దాన్నొక కొరతగా భావించలేదు. దేశాన్ని కాపాడే బాధ్యతాయుతమైన వృత్తిలో ఉన్న విక్రమ్ అంటే నాకెంతో గౌరవం. ఆయన మాతో కలిసి ఉండే కొద్ది రోజులూ ఆనందంగా గడుపుతూ ఉంటాం. ఆయన అప్పుడప్పుడూ తన సైనిక అనుభవాలను నాతో పంచుకునేవారు. అయితే ముఖ్యమైన విషయాలే తప్ప తాను పాల్గొనే కొన్ని రహస్య మిషన్స్ గురించి చర్చించేవారు కారు. కొన్ని సందర్భాల్లో తనకెదురైన ప్రమాదకరమైన సంఘటల గురించి చాలా కాలం తర్వాత ఎంతో తాపీగా, యధాలాపంగా చెప్పేవారు. ఆయన చెప్తున్న విషయాలు విన్నప్పుడు గుండె ఝల్లుమనేది. ఓ సందర్భంలో హిమపాతం నుంచి తృటిలో తప్పించుకున్నాననీ, మరో సందర్భంలో చెవి పక్క నుంచి తుపాకీ గుండు దూసుకువెళ్లిందనీ నాతో చెప్పారు. ఇలాంటివి విన్నప్పుడు ఒక సగటు భార్యగా భయాందోళనకు లోనయ్యేదాన్ని.

### అదే చివరిసారి అనుకున్న సందర్భం

సైనికుల భార్యల జీవితాలు తీగ మీద నడక చందం. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు. ఇక ఆయనను చూడడం ఇదే చివరిసారి అనుకున్న సందర్భాలు కూడా ఉన్నాయి. అప్పటికి మా పెళ్లై ఆరు నెలలు. ఓ రోజు అకస్మాత్తుగా సైన్యం నుంచి ఆయనకు పిలుపొచ్చింది. రాత్రికి రాత్రే సైనికులందరూ వెళ్లిపోయారు. వెళ్లినవాళ్లు ప్రాణాలతో తిరిగొస్తారనే నమ్మకం లేదు. పాస్‌పోర్టులు, బ్యాంక్ పాస్‌బుక్స్ చేతికి అందించి, తిరిగి రాకపోతే ఏం చేయాలో వివరిస్తుంటే విపరీతంగా భయపడిపోయాను. సినిమాల్లో తప్ప, నిజ జీవితంలో సైనికుల జీవితాలు ఎలా ఉంటాయో ఏమాత్రం అవగాహన లేని నేను గుండెలదురుతూనే ఆయనను సాగనంపాను. అయితే సినిమాల్లోలా సైనికులను ఏడుస్తూ సాగనంపే సన్నివేశాలు నిజ జీవితంలో ఉండవు. సంతోషంగా హారతిచ్చి, బొట్టు పెట్టి పంపిస్తాం. భయం, బాధ ఉన్నా, వాటిని మనసులోనే దాచుకుని దేశ ప్రజల భద్రత కోసం ప్రాణాలకు తెగిస్తున్న భర్తలను హుందాగా సాగనంపుతాం! వాళ్లు వెళ్లిపోయిన తర్వాత సైనికుల భార్యలుగా మేమందరం ఎంతో బాధ్యతగా నడుచుకుంటాం! పిల్లలూ, పెద్దల బాగోగులు చూసుకోవడంతో పాటు కంటోన్మెంట్లలోని జవాన్ల భార్యాపిల్లలను చూసుకోవలసిన బాధ్యత కూడా పైఅధికారుల భార్యలకు ఉంటుంది. కల్నల్ భార్యగా నేనలాంటి బాధ్యతలను నిర్వర్తిస్తూ ఉంటాను. మేమందరం ఒకే కుటుంబంలా కలిసిమెలసి జీవిస్తూ ఉంటాం.

Printed,Published and Owned by GILAKARA SRIDHAR, Printed at M/S Kakatiya Printers ,H.NO. 24-91/72,73,74 IDA Uppal, Uppal Mandal,Medchal Malkajgiri District,Telangana, Published at,H.NO.1-5-631/276,Abedkar Colony,Old Alwal Village,Alwal Mandal,Medchal Malkajgiri District,Telangana,cell 6305539214,Editor GILAKARA SRIDHAR,RNI NO,TEL TEL/2016/71618. gmail: maroudayam20@gmail.com